ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు

NO
SMOKING
ALCOHOL
SAY NO TO DRUGS

Published From : Rangareddy, Hyderabad e - paper.vaarthasandhya.in సంపుటి : 01 సంచిక : 69 ఆదివారం 22 - 02 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజిలు : 08 వెల : 6/-

Published From : Rangareddy, Hyderabad e - paper.vaarthasandhya.in VOLUME : 01 Issue : 69 Sunday 22 - 02 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

## పైరవీలు పని చేయవు
## మెరిట్ ఉన్నవారికే పార్టీలో గుర్తింపు

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- వికారాబాద్ జిల్లా అనంతగిరిలో డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమం
- శిక్షణా తరగతులను ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి
- డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమానికి హాజరుకానున్న ఖర్గే, కేసీ వేణుగోపాల్
- కాంగ్రెస్ పార్టీలో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే సంస్కృతి, స్వేచ్ఛ ఉందని ముఖ్యమంత్రి రేవంత్
- మనలో మనం కొట్లాడుకుంటే పార్టీ కోసం కష్టపడే లక్షలాది కార్యకర్తలకు అన్యాయం చేసిన వాళ్లం అవుతాం
- ఆర్నెళ్ల తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజార్టీ 4 శాతానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెరిగిందన్నారు
- దేశాన్ని ఐక్యంగా ఉంచే కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీని కనుమరుగు చేయాలని కుట్ర జరుగుతోందని రేవంత్ రెడ్డి తెలిపారు



**వార్త సంధ్య, హైదరాబాద్, ఫిబ్రవరి 21 :** కాంగ్రెస్ పార్టీలో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే సంస్కృతి, స్వేచ్ఛ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి పార్టీలో లేదన్నారు. మనలో మనం కొట్లాడుకుంటే పార్టీ కోసం కష్టపడే లక్షలాది కార్యకర్తలకు అన్యాయం చేసిన వాళ్లం అవుతామని పార్టీ నాయకులను ఉద్దేశించి అన్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో డీసీసీ అధ్యక్షుల శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రసంగించారు.కాంగ్రెస్ పార్టీని కనుమరుగు చేయాలనే కుట్ర జరుగుతోంది : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మెజార్టీ 2 శాతమే తేడా అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆర్నెళ్ల తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజార్టీ 4 శాతానికి పెరిగిందన్నారు. రెండేళ్ల తర్వాత జరిగిన - మిగతా 2 లో

### ఏఐ సమ్మిట్ వద్ద యూత్ కాంగ్రెస్
## నిరసనలపై కేటీఆర్ స్పందన

- అంతర్జాతీయ సదస్సులను రాజకీయ ప్రదర్శనలకు ఉపయోగించడంపై కేటీఆర్ మండిపాటు
- ఇది దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే చర్య అని వ్యాఖ్య
- ఇలాంటి వేదికల్లో హుందాగా వ్యవహరించాలని సూచన



**వార్త సంధ్య, హైదరాబాద్, ఫిబ్రవరి 21 :** ఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ - 2026 వేదిక వద్ద యూత్ కాంగ్రెస్ నాయకులు చేసిన నిరసనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఇలాంటి అంతర్జాతీయ సదస్సులను రాజకీయ ప్రదర్శనలకు ఉపయోగించడం దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే చర్య అని అభివర్ణించారు. అంతర్జాతీయ సదస్సులు దేశ ప్రతిభను, సామర్థ్యాన్ని ప్రపంచానికి చూపించే వేదికలని అన్నారు. ఇలాంటి వేదికల్లో హుందాగా వ్యవహరించాలని చెప్పారు.రాజకీయ విభేదాలు సహజమే అయినా. అభిప్రాయ భేదాలను వ్యక్తపరచడానికి సరైన సమయం, సరైన వేదిక ఉండాలని కేటీఆర్ అన్నారు. గ్లోబల్ ఈవెంట్‌లలో ఇలాంటి నిరసనలు చేపట్టడం వల్ల భారత్‌పై అంతర్జాతీయంగా ప్రతికూల అభిప్రాయం ఏర్పడే ప్రమాదం ఉందని విమర్శించారు. ఈ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలోనే యూత్ కాంగ్రెస్ నాయకులు నిరసన చేయడం చాలా విచిత్రంగా ఉందని వ్యాఖ్యానించారు.

## కాంగ్రెస్ కార్యకర్తల నిరసన దిగ్భ్రాంతి కలిగించింది

- ఏపీ మంత్రి నారా లోకేశ్
- ఏఐ సదస్సులో యూత్ కాంగ్రెస్ ఆందోళనపై మంత్రి లోకేశ్ ఆగ్రహం
- దేశ ప్రతిష్ఠ దెబ్బతీసేలా వ్యవహరించారని తీవ్ర విమర్శ
- ప్రతిష్ఠాత్మక వేదికలను రాజకీయాలకు వాడుకోవడం సరికాదన్న లోకేశ్
- ఆవిష్కరణలపై దృష్టిపెట్టి దేశాన్ని నిర్మించుకోవాలని పిలుపు




**వార్త సంధ్య, అమరావతి, ఫిబ్రవరి 21 :** ఢిల్లీలో నిన్న "ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026"లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు సృష్టించిన గందరగోళంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం, విచారం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ - మిగతా 2 లో

## ఏఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ వ్యవహార శైలిపై జగన్ విమర్శలు

- ఏఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ వ్యవహార శైలిపై జగన్ విమర్శలు
- ఏపీ సమ్మిట్‌లో నిన్న మధ్యాహ్నం యూత్ కాంగ్రెస్ కార్యకర్తల నిరసన
- టీ షర్టులు విప్పేసి నినాదాలు చేసిన వైనం
- అందరూ సిగ్గుపడేలా యూత్ కాంగ్రెస్ వ్యవహరించిందన్న జగన్


2 లో


2 లో

### ఢిల్లీ ఎర్రకోట వద్ద
## పేలుళ్లకు లష్కరే కుట్ర!

- ఇతర నగరాల్లోనూ ఐఈడీ పేలుళ్లకు ప్లాన్
- ప్రముఖ దేవాలయాలే లక్ష్యంగా దాడులు జరిగే ఛాన్స్
- ఇస్లామాబాద్ మసీద్ పేలుడుకు ప్రతీకారంగా ఉగ్రవాదుల కుట్రలు

### నేను పార్టీ అధ్యక్షుడిని అయ్యే నాటికి
## పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉంది

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- పార్టీలో కొందరి నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నానని తెలిపిన రేవంత్ రెడ్డి
- నేతలందరినీ కలిసి తన ఆలోచన చెప్పి వారిని ఒప్పించానన్న ముఖ్యమంత్రి
- అందరి కృషి వల్ల తెలంగాణలో పార్టీ తిరిగి పుంజుకున్నదన్న ముఖ్యమంత్రి



**వార్త సంధ్య, హైదరాబాద్, ఫిబ్రవరి 21 :** తాను టీపీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టే నాటికి పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రేవంత్ రెడ్డి అన్నారు. పార్టీలో కూడా కొందరి నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నానని, నేతలందరినీ కలిసి తన ఆలోచన చెప్పి వారిని ఒప్పించానని గుర్తుచేసుకున్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో నిర్వహించిన - మిగతా 2 లో

## పరీక్షలు ఉన్నాయని ఆందోళన వద్దు


- ఇంటర్ విద్యార్థులకు కవిత సూచన
- ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయాలని సూచన
- పరీక్షలు బాగా రాయలేనేనే ఆందోళన వద్దన్న కవిత
- పరీక్షలు అనేవి పూర్తి జీవితంలో చిన్న అంశమని వ్యాఖ్య


2 లో

### అబ్దుల్లాపూర్ మెట్టు శివారులో
# జోరుగా ఇటుక బట్టీల దందా



### ఘాఢ నిద్రలో అధికార యంత్రాంగం
### నిబంధనలను ఉల్లంఘిస్తూ ఇటుక బట్టి నిర్వహణ



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 21 ( వార్త సంధ్య) :**

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్టు పరిసర ప్రాంతాల్లో అక్రమంగా ఇటుక బట్టీలు విస్తరిస్తున్నాయని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కవాడిపల్లి, బలిజగూడ, తారమసిపేట్ శివారుల్లో చట్టబద్ధ అనుమతులు లేకుండానే పెద్ద ఎత్తున ఇటుక తయారీ కేంద్రాలు ఏర్పడి దందా జోరుగా సాగుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలను పక్కనబెట్టి రాత్రింబవళ్లు ఇటుక తయారీ కొనసాగుతుండటంతో అధికారులు చూడనట్టే వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.స్థానికుల సమాచారం ప్రకారం, అనేక ఇటుక బట్టీలు భూ వినియోగ అనుమతులు, కాలుష్య నియంత్రణ అనుమతులు, గనుల శాఖ అనుమతులు లేకుండానే నడుస్తున్నాయని చెబుతున్నారు. వ్యవసాయ భూములను తాత్కాలిక లీజ్ పేరుతో తీసుకుని, తరువాత భారీ స్థాయిలో మట్టి తవ్వకాలు జరుపుతూ ఇటుక తయారీ కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ తవ్వకాలు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నప్పటికీ ఎలాంటి తనిఖీలు లేకపోవడం గమనార్హమని గ్రామస్తులు అంటున్నారు.ఇటుక బట్టీల యాజమానులు అక్రమంగా మట్టిని ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తీసుకువచ్చి నిల్వ చేసి, నిరంతరం ఇటుక ఉత్పత్తి చేస్తూ కోట్ల రూపాయల లాభాలు ఆర్జిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీలు, పన్నులు తప్పించుకునేందుకు అనధికార మార్గాలను అనుసరిస్తున్నారని కూడా చెబుతున్నారు. రికార్డుల్లో లేని ఉత్పత్తిని ఇతర ప్రాంతాలకు తరలించి అక్రమంగా విక్రయిస్తున్నట్లు సమాచారం.ముఖ్యంగా రాత్రి వేళల్లో అక్రమ కార్యకలాపాలు ఎక్కువగా జరుగుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ట్రాక్టర్లు, లోడింగ్ వాహనాల ద్వారా మట్టిని తరలిస్తూ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని వారు పేర్కొంటున్నారు.

#### గాలికి వదిలేసిన కాలుష్య నియంత్రణ

కాలుష్య నియంత్రణ ప్రమాణాలను పాటించకుండా ఇటుక కాల్చే బట్టీలు నడపడం వల్ల పరిసర ప్రాంతాల్లో దుమ్ము, పొగ కాలుష్యం పెరుగుతోందని ప్రజలు చెబుతున్నారు. అధికారికంగా అనుమతులు పొందిన బట్టీలకు ఉండే నియంత్రణ వ్యవస్థలు, రక్షణ చర్యలు లేకుండా అక్రమంగా బట్టీలు నడుస్తున్నాయని ఆరోపిస్తున్నారు. దీనివల్ల సమీప గ్రామాల్లో గాలి నాణ్యత దెబ్బతింటోందని స్థానికులు పేర్కొంటున్నారు.గ్రామస్తుల ఆరోపణల ప్రకారం, సంబంధిత శాఖలకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు గణనీయమైన చర్యలు తీసుకోలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది యాజమానులు ప్రభావశీలుల మద్దతుతో తనిఖీలను తప్పించుకుంటున్నారనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అక్రమంగా బట్టీలు నడుస్తున్నప్పటికీ రెగ్యులర్ ఇన్స్పెక్షన్లు జరగకపోవడం ప్రశ్నార్థకంగా మారింది.

#### పేపర్లకే పరిమితం అవుతున్న నిబంధనలు

ఇటుక బట్టీల ఏర్పాటు కోసం అవసరమైన భూ అనుమతులు, పర్యావరణ అనుమతులు, కాలుష్య నియంత్రణ బోర్డు క్లియరెన్స్ వంటి కీలక నిబంధనలు తప్పనిసరి అయినప్పటికీ, వీటిని పూర్తిగా విస్మరించి కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారిక అనుమతులు లేకుండా వాణిజ్య స్థాయిలో ఉత్పత్తి చేయడం చట్ట విరుద్ధమని నిపుణులు చెబుతున్నారు.స్థానికంగా కొన్నిచోట్ల ప్రభుత్వ భూముల సమీపంలో కూడా ఇటుక బట్టీలు - మిగతా 5 లో

# సంపాదకీయం

## కొరియా న్యాయం



దక్షిణకొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్‌యోల్ ఇక సుదీర్ఘ జైలుజీవితం గడపాల్సి ఉంటుంది. 2024 డిసెంబరులో దేశంలో సైనికపాలన విధించేందుకు ఆయన చేసిన ఓ ప్రయత్నం ఈ శిక్షకు కారణం. పార్లమెంటును అదుపులోకి తీసుకొని, రాజకీయనేతలను అరెస్టు చేయాల్సిందిగా భద్రతాదళాలను ఆదేశించిన ఆయనకు ఈ శిక్షసరిపోదని, మరణశిక్ష విధించాల్సిందేనని ప్రాసిక్యూటర్లు న్యాయస్థానంలో గట్టిగా వాదించారు. సైనికపాలన నిర్ణయాన్ని కొద్దిగంటల్లోనే ఉపసంహరించుకున్నా, తన దుశ్చర్యకు తీవ్ర పశ్చాత్తాపాన్ని ప్రకటించినా, ఆయన అటు అధికారాన్నీ నిలబెట్టుకోలేకపోయారు, ఇటు శిక్షనీ తప్పించుకోలేకపోయారు. ఎంత పెద్ద తప్పుచేసినా తమను తాము సమర్థించుకొనే నాయకులను, వారిని గుడ్డిగా సమర్థించే దిగువస్థాయి నేతలను చూస్తున్న మనకు దక్షిణకొరియా పరిణామాలు ఆశ్చర్యం కలిగిస్తాయి.అధికారంలోకి వచ్చిన రెండేళ్ళలోనే ఆయన పదవి పోగొట్టుకొనే పరిస్థితులను సృష్టించుకున్నాడు, కుర్చీని రక్షించుకొనే ప్రయత్నంలో మరిన్ని తప్పటడుగులు వేశాడు. భార్యకు గిఫ్ట్‌రూపంలో వచ్చిన ఒక బ్యాగ్ ఈయన రాజకీయజీవితాన్ని తిరగరాసిందంటారు. ఈ మార్షల్ లా ప్రకటించడానికి కొన్ని నెలలముందు ఆమె ఒక పాస్టర్ నుంచి సుమారు లక్షన్నర రూపాయలు విలువచేసే బ్యాగ్‌ను బహుమతిగా స్వీకరించారు. మొదట్లో అధ్యక్షకార్యాలయం దానిని దుష్ప్రచారంగా కొట్టిపారేసినా, ఆ తరువాత వెలుగుచూసిన ఒక వీడియోలో పాస్టర్‌నుంచి ఆమె బహుమతి స్వీకరిస్తున్న దృశ్యాలు బయటపడి, అధ్యక్షకార్యాలయం తప్పు ఒప్పుకోవాల్సివచ్చింది, అధికార పార్టీ క్షమాపణలు కోరింది. పాస్టరే రహస్య కెమెరాతో ఈ ఘట్టాన్ని చిత్రీకరించారనట్టుగా ఓ ప్రచారం ఉంది. అప్పటికే పలు అవినీతి ఆరోపణలతో అధ్యక్షులవారి భార్యపట్ల ప్రజల్లో సదభిప్రాయం లేనందున, ఈ సంఘటన యూన్‌సిక్‌యోల్ పరువుప్రతిష్ఠలను మరింత దిగజార్చింది. ఒక ఎక్స్‌ప్రెస్ వే ప్రాజెక్టుకోసం అమాంతంగా భూమి ధరలు పెంచారని, అక్రమంగా అనుమతులు ఇచ్చి యోన్ కుటుంబీకులు బాగుపడ్డారని తీవ్రప్రచారం జరిగిన నేపథ్యంలో అధికారపార్టీ నుంచి కొందరు బయటకుపోయారు కూడా.ప్రజల్లో ఆదరణ తగ్గి, నమ్మకం సన్నగిల్లుతున్నప్పుడు నాయకుడు కొత్త ఎత్తులు వేస్తాడు. వారిని మాయచేయగలనని అనుకుంటాడు. ఉత్తరకొరియాను బూచిగా చూపి ప్రజల్లోనూ, స్వపక్షంలోనూ తనపై పెరిగిపోతున్న వ్యతిరేకతని అధిగమించగలనని ఆయన భ్రమపడ్డాడు. విపక్షనేతలు దేశవ్యతిరేకశక్తులనీ, దేశద్రోహులతో రహస్య మంతనాలు సాగిస్తున్నారనీ, దేశం తీవ్ర ప్రమాదంలో పడిందనీ, ఉత్తరకొరియా కమ్యూనిస్టు దళాలనుంచి దానిని రక్షించుకోవాల్సి ఉన్నదనీ బెదిరిస్తూ ఆయన సైనికపాలన విధించాడు. అయితే, ప్రజలూ వారి నాయకులూ ఆయన కుట్రని సాగనివ్వలేదు. తాము ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకున్న నాయకుడు మరో నియంతగా తయారైనాడని గ్రహించిన వేలాది ప్రజలు ఎవరి ప్రోద్బలమూ లేకుండా, స్వల్పకాలంలోనే రోడ్లమీదకు వచ్చి, నినాదాలతో, నిరసనలతో అధినాయకుడిని గడగడలాడించారు. ఉత్తచేతులతో సైన్యం చేతుల్లో ఉన్న తుపాకులు లాక్కున్నారు. స్వపక్ష, విపక్షాలకు చెందిన రెండువందలమంది ఎంపీలు రాత్రికిరాత్రి గేట్లు దూకి, కంచెలు దాటి పార్లమెంట్ భవనంలోకి ప్రవేశించి అక్కడ ఏకకంఠంతో అధ్యక్షుడి నిర్ణయాన్ని తిరగదోడారు. నెత్తిన యుద్ధవిమానాలు తిరిగే వాతావరణంలో బతుకుతూండే దక్షిణకొరియన్లకు పొరుగుదేశం ఎంత ప్రమాదకరమైనదో తెలిసినప్పటికీ, ఉత్తరకొరియా బూచిని చూపి తమ దేశాధ్యక్షుడు తన తప్పుడు పనులను సమర్థించుకోవడానికి వారు ఒప్పుకోలేదు. అధ్యక్షుడి ఆదేశాలు ఉన్నప్పటికీ, జనాన్ని కొట్టకుండా, కాల్చకుండా వారి నిరసనలను సైన్యం గౌరవించడం మరో విశేషం. ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానానికి వారూ వీరూ అన్నతేడాలేకుండా అంతా మద్దతు ఇవ్వడంతో యూన్ సుక్‌యోల్ మారుమాట్లాడకుండా గద్దెదిగాల్సివచ్చింది. తిరుగుబాటుకు ప్రయత్నించారన్న ఆరోపణలమీద ఆయనపై దర్యాప్తు సాగింది. నాలుగుదశాబ్దాల క్రితం వరకూ సైనికపాలనను అనుభవించిన దక్షిణకొరియా ప్రజలు నియంతృత్వం తిరిగి తలెగరేయకుండా జాగ్రత్తపడినందుకు మెచ్చుకోవాలి. దక్షిణకొరియాలో అరెస్టయిన తొలి సిట్టింగ్ ప్రెసిడెంట్‌గా రికార్డులకు ఎక్కిన సుక్‌యోల్ ఇకపై మిగతా జీవితం జైల్లో గడపాల్సివస్తుంది.

## కాంగ్రెస్ కార్యకర్తల నిరసన దిగ్భ్రాంతి కలిగించింది


**మొదటిపేజీ తరువాయి** – వేదికపై వారి ప్రవర్తన దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు. ఏఐ రంగంలో ఎదుగుతున్న భారత్ శక్తిని ప్రపంచానికి చాటేందుకు ఉద్దేశించిన సదస్సులో ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు.ఈ మేరకు లోకేశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. "ఏఐ సూపర్ పవర్‌గా భారత్ ఎదుగుతున్న తీరును ప్రదర్శించేందుకు ఈ సదస్సు ఒక గొప్ప అవకాశం. అలాంటి ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ కార్యక్రమాన్ని రాజకీయ వేదికగా మార్చడం ద్వారా ప్రపంచం ముందు మనందరి ప్రతిష్ఠను తగ్గించారు. ఇది దిగ్భ్రాంతికరం, విచారకరం" అని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు.భారతదేశం ఇంతకంటే మెరుగైన గౌరవానికి అర్హమైనదని ఆయన అభిప్రాయపడ్డారు. "మనం ఇలాంటి చిల్లర రాజకీయాలను పక్కనపెట్టి, ఆవిష్కరణలు, నైపుణ్యం ద్వారా దేశ నిర్మాణానికి ప్రాధాన్యత ఇద్దాం" అని లోకేశ్ పిలుపునిచ్చారు. దేశ ప్రతిష్ఠకు సంబంధించిన విషయాల్లో రాజకీయాలు చేయడం తగదని ఆయన హితవు పలికారు.

## ఏఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ వ్యవహార శైలిపై జగన్ విమర్శలు

**మొదటిపేజీ తరువాయి** – గుప్పించారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ... ఏఐ సమ్మిట్ లో మనమంతా సిగ్గుపడేలా యూత్ కాంగ్రెస్ వ్యవహరించిందని మండిపడ్డారు. మన రాజకీయాలు ఎటువైపు వెళుతున్నాయని ప్రశ్నించారు. మన దేశాన్ని ఎవరూ, ఎప్పుడూ కించపరచకూడదని చెప్పారు. మన మధ్య ఎలాంటి రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ... ప్రపంచం ముందు అందరం ఐక్యంగా ఉండాలని అన్నారు.

పర్యావరణ హితమైన రవాణాకు మార్గం సుగమం అవుతుందని ప్రభుత్వం తెలిపింది.

## ఢిల్లీ ఎర్రకోట వద్ద పేలుళ్లకు లష్కరే కుట్ర!



**మొదటిపేజీ తరువాయి** – ఢిల్లీలోని ఎర్రకోట, చాందినీ చౌక్‌లోని ఒక ఆలయం మరియు దేశవ్యాప్తంగా ఉన్న ఇతర ప్రధాన దేవాలయాల సమీపంలో పేలుళ్లు జరపాలని పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా ప్లాన్ చేస్తోందని సమాచారం. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లోని ఒక మసీదులో ఫిబ్రవరి 6న జరిగిన పేలుడుకు ప్రతీకారంగా ఈ దాడులకు ప్లాన్ చేస్తున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలకు సమాచారం అందినట్లు తెలుస్తోంది. భద్రతా సంస్థల సమాచారం ప్రకారం, లష్కరే తోయిబా ఉగ్రవాదులు ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్ (ఐఈడీ) ద్వారా దాడికి కుట్ర పన్నుతున్నట్లు తెలిసింది. ఫిబ్రవరి 6న ఇస్లామాబాద్‌లోని మసీదులో జరిగిన పేలుడుకు ప్రతీకారం తీర్చుకోవడమే ఈ కుట్ర వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని భద్రతా బలగాలు వెల్లడించాయి.

# దేశంలో ఏ రాష్ట్రమూ ఏపీకి దరిదాపుల్లో లేనంత సంక్షేమం



మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు అన్నారు. "దేశంలో ఏ రాష్ట్రమూ ఏపీకి దరిదాపుల్లో లేనంత సంక్షేమాన్ని అందిస్తున్నాం. మొదటి తారీఖునే పేదల సేవలో భాగంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో స్వయంగా పాల్గొంటున్నాను. 'తల్లికి వందనం' ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా ఆర్థిక సాయం అందిస్తున్నాం. 'అన్నదాత సుఖీభవ' కింద రైతులకు మూడు విడతల్లో రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నాం" అని వివరించారు.

**మహిళా సాధికారత, ప్రజల భాగస్వామ్యం**

మహిళల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. "స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. వారు ఈ పథకాన్ని చక్కగా వినియోగించుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉంది. లక్ష మంది మహిళలను ఎంఎస్ఎంఈలుగా తీర్చిదిద్దుతున్నాం" అని పేర్కొన్నారు. పీ4 కార్యక్రమం కింద ఇప్పటివరకు 10 లక్షల కుటుంబాలను దత్తత తీసుకున్నామని, వారికి మార్గనిర్దేశం చేసేందుకు లక్ష మంది మార్గదర్శులు ముందుకు వచ్చారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 561 స్వయం సహాయక సంఘాలకు రూ.100.14 కోట్ల చెక్కును అందించారు.

**టెక్నాలజీతో సుపరిపాలన**

పౌర సేవల్లో టెక్నాలజీ వినియోగానికి పెద్దపీట వేస్తున్నామని చంద్రబాబు చెప్పారు. "దేశంలో ఏ రాష్ట్రం కూడా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సేవలు అందించడం లేదు. త్వరలో విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో శిక్షణ ఇచ్చేందుకు ఏఐ ట్యూటర్‌ను తీసుకువస్తున్నాం. ఇటీవల బిల్ గేట్స్ కూడా రాష్ట్రానికి వచ్చి రైతులు టెక్నాలజీని వినియోగిస్తున్న తీరును చూసి ఆనందం వ్యక్తం చేశారు" అని గుర్తుచేశారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్, అమరావతిలో క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు కానున్నాయని వెల్లడించారు.

**ఆరోగ్యానికి భరోసా, వ్యవసాయానికి చేయూత**

ప్రజల ఆరోగ్యం కోసం యూనివర్సల్ హెల్త్ పాలసీ తీసుకువస్తున్నామని, పేద కుటుంబాలకు ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు ద్వారా రూ.25 లక్షల వరకు చికిత్స ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. వ్యవసాయంలోనూ టెక్నాలజీని ప్రవేశపెట్టి సాగును సులభతరం చేస్తామన్నారు. రైతులు పండించే పంటలకు మార్కెట్ ధర అందేలా, సాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వినుకొండను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే ఆలోచన ఉందన్నారు.

**స్వచ్ఛాంధ్ర లక్ష్యంగా పటిష్ట చర్యలు**

స్వచ్ఛమైన వాతావరణం కల్పించడమే 'స్వచ్ఛాంధ్ర' లక్ష్యమని సీఎం అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాయణ నేతృత్వంలో ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా సాగుతోందన్నారు. "గత పాలకులు వదిలేసిన 108 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించే బృహత్తర కార్యక్రమం చేపట్టాం. మార్చి నాటికల్లా గ్రామీణ ప్రాంతాల్లో వందశాతం డోర్ టు డోర్ చెత్త సేకరణ పూర్తి చేస్తాం" అని ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించామని, దీనివల్ల పశువులు, ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని వివరించారు.

**చెత్త నుంచి సంపద.. మారాల్సిన తీరు**

చెత్తను సంపదగా మార్చే ప్రక్రియను ప్రోత్సహిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "విశాఖ, గుంటూరులలో చెత్త నుంచి విద్యుత్ తయారు చేసే ప్లాంట్లు ఉన్నాయి. రాజమండ్రితో పాటు మరో 5 ప్లాంట్లు త్వరలో ఏర్పాటు చేస్తాం. రాష్ట్రంలో 4 లక్షలకు పైగా కుటుంబాలు హోం కంపోస్టింగ్ ద్వారా ఎరువు తయారు చేసుకుంటున్నాయి" అని ప్రశంసించారు. చెత్త నిర్వహణలో జపాన్ పౌరుల తరహాలో మన ఆలోచనా తీరు మారాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, గొట్టిపాటి రవికుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్, కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు పాల్గొన్నారు.

# పైరవీలు పని చేయవు - మెరిట్ ఉన్నవారికే పార్టీలో గుర్తింపు



**మొదటిపేజీ తరువాయి** – మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజారిటీ 12 శాతమని వివరించారు. కార్యకర్తల కృషి, ప్రజల నమ్మకం వల్లే కాంగ్రెస్ ఓటు శాతం పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ కుటుంబంలో 3 తరాలు దేశం కోసం ప్రాణాలు అర్పించారని, ఆయనకు సొంత ఇల్లు కూడా లేదన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన రాహుల్‌గాంధీ కుటుంబంపై ఇవాళ నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. దేశాన్ని ఐక్యంగా ఉంచే కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీని కనుమరుగు చేయాలని కుట్ర జరుగుతోందని రేవంత్ రెడ్డి తెలిపారు.పార్టీ నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ పైరవీల కోసం తిరిగితే ప్రజల్లో, పార్టీలో చులకన అవుతారని రేవంత్ రెడ్డి సూచించారు. వాటిని వదిలేసి ప్రజల తరఫున పోరాడితే గౌరవం, మర్యాద తప్పక పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. సొంత అజెండా వదిలేసి ప్రజా అజెండా, పార్టీ అజెండా కోసం కృషి చేయాలని పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. సమస్యలపై కొట్లాడితే స్వపక్షంతో పాటు విపక్షం కూడా గౌరవిస్తుందన్నారు."నేను పీసీసీ అధ్యక్షుడిని అయ్యే నాటికి పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉండేది. పార్టీలోనూ కొందరి నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నాను. నేతలందరినీ కలిసి నా ఆలోచనలు చెప్పి అందరినీ ఒప్పించాను. అందరం కృషి చేయడంతో పార్టీ ఓటింగ్ 2.5 శాతం నుంచి 40 శాతానికి చేరింది. డీసీసీ అధ్యక్షులుగా బాగా పని చేసిన వారికి ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చాం. పార్టీ కోసం కృషి చేసిన మరో 60 మందికి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చాం. ఎమ్మెల్యే టికెట్లు పొందలేని వారికి ఎమ్మెల్సీలు ఇచ్చాం. పార్టీలో అందరి పని తీరు మీద నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. మెరిట్ ఉన్న వారికి పార్టీలో కచ్చితంగా న్యాయం జరుగుతుంది. గాంధీ కుటుంబం దేశం కోసం ప్రాణాలర్పించింది : మోతీలాల్ నెహ్రూ రూ.వేల కోట్ల ఆస్తులను దేశం కోసం త్యాగం చేశారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ దేశం కోసం ఎన్నో ఏళ్లు జైలులో ఉన్నారన్నారు. ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీ ఈ దేశం కోసం ప్రాణాలు అర్పించారని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన కొన్నాళ్లకే గాంధీజీని కోల్పోయామన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారని సీఎం గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర చేసి ప్రజల మధ్య రోజుల తరబడి ఉన్నారని రేవంత్ వివరించారు. డీసీసీ పదవి చాలా విలువైనదని, వచ్చిన అవకాశాన్ని దుర్వినియోగం చేసుకోవద్దని కోరారు. డీసీసీ నుంచి పీసీసీ, ఎమ్మెల్యే, ఎంపీ, సీఎం కావొచ్చన్నారు. ఏఐసీసీ ఆధ్వర్యంలో తెలంగాణ, ఏపీ జిల్లా అధ్యక్షులకు (డీసీసీ) శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. మార్చి 2 వరకు డీసీసీ శిక్షణా తరగతులు జరగనున్నాయి. ఈ కార్యక్రమాలకు ఖర్గే, కేసీ వేణుగోపాల్‌లు హాజరు కానున్నారు. ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి.

# నేను పార్టీ అధ్యక్షుడిని అయ్యే నాటికి పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉంది



**మొదటిపేజీ తరువాయి** – ఏపీ, తెలంగాణ డీసీసీ అధ్యక్షుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.కాంగ్రెస్ పార్టీలో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే స్వేచ్ఛ ఉందని అన్నారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి కాంగ్రెస్ పార్టీలో లేదని వెల్లడించారు. మనలో మనం కొట్టుకుంటే పార్టీలో కష్టపడి పనిచేసే లక్షలాది మంది కార్యకర్తలకు అన్యాయం చేసినట్లు అవుతుందని అన్నారు. అందరి కృషి వల్లే తెలంగాణలో పార్టీ తిరిగి పుంజుకున్నదని అన్నారు.డీసీసీ అధ్యక్షులుగా బాగా పనిచేసిన వారికి ఎమ్మెల్యే టిక్కెట్లు ఇచ్చామని, ఎమ్మెల్యే టిక్కెట్లు రాని వారికి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చామని తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన మరో అరవై మందికి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చామని ముఖ్యమంత్రి వెల్లడించారు. పార్టీలో అందరి పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని హెచ్చరించారు. పార్టీ కోసం శ్రమించే వారికి కచ్చితంగా న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. మెరిట్ ప్రకారమే పార్టీలో అవకాశాలు వస్తాయన్నారు.డీసీసీ పదవి ఎంతో విలువైనదని, దీనిని ఏమాత్రం దుర్వినియోగం చేసుకోవద్దని హితవు పలికారు. మంచి ప్రతిభ కనబరిస్తే ఆ తర్వాత ఎమ్మెల్యే, మంత్రి, ముఖ్యమంత్రి కూడా కావొచ్చని అన్నారు. నాయకులు ఎప్పుడూ ప్రజల్లో ఉండాలని సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర చేసి ప్రజల మధ్య రోజుల తరబడి ఉన్నారని అన్నారు.ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారని గుర్తుచేశారు. మోతీలాల్ నెహ్రూ దేశం కోసం వేల కోట్ల రూపాయలను ఆ రోజుల్లోనే త్యాగం చేశారని, జవహర్ లాల్ నెహ్రూ జైల్లో ఉన్నారని తెలిపారు. ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలు అర్పించారని తెలిపారు.

## పరీక్షలు ఉన్నాయని ఆందోళన వద్దు



**మొదటిపేజీ తరువాయి** – తెలంగాణలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఈ నెల 25వ తేదీ నుంచి జరగనున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విద్యార్థులకు సూచనలు చేశారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా, పూర్తి ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆమె ఆకాంక్షించారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరికి ఆమె శుభాకాంక్షలు తెలిపారు.పరీక్షల్లో ఆందోళనకు గురికాకుండా ఎంత వస్తే అంత రాయాలని సూచించారు. ఫలితాల కోసం ఏమాత్రం ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి చేశారు. పరీక్షలు బాగా రాయలేనేమోననే ఆందోళనతో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నట్లు వార్త చూశానని, కాబట్టి ఫలితాల గురించి భయపడవద్దని అన్నారు. పరీక్షలు అనేవి జీవితంలో చిన్న పందెమని గుర్తుంచుకోవాలని సూచించారు.ఒక పరీక్ష సరిగ్గా రాయకుంటే మన జీవితం అంతటితో ఆగిపోదని అన్నారు. పరీక్షల తర్వాత ఎంతో జీవితం ఉందని వ్యాఖ్యానించారు. పరీక్షల భయంతో ఏదైనా చేసుకుంటే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఎంత క్షోభిస్తారో గుర్తుంచుకోవాలని అన్నారు. పరీక్షల వంటి చిన్న చిన్న అంశాలను దాటుకుంటూ వెళితే జీవితంలో పెద్ద పెద్ద వాటిని సులభంగా ఎదుర్కోవచ్చని అన్నారు.

## దేశంలోనే ఫాస్టెస్ట్ మెట్రో.. మీరట్‌లో సరికొత్త రికార్డు!




**మొదటిపేజీ తరువాయి** – చేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ 'మీరట్ మెట్రో' సేవలను కూడా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం శతాబ్ది నగర్ స్టేషన్ నుంచి మీరట్ సౌత్ స్టేషన్ వరకు మెట్రోలో ప్రయాణించారు. తాజా ప్రారంభోత్సవంతో ఢిల్లీలోని సారాయ్ కాలే ఖాన్ నుంచి మీరట్‌లోని మోదీపురం వరకు ప్రయాణ సమయం కేవలం 58 నిమిషాలకు తగ్గనుంది. ఇంతకుముందు ఈ ప్రయాణానికి దాదాపు మూడు గంటల సమయం పట్టేది.గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే మీరట్ మెట్రో, దేశంలోనే అత్యంత వేగవంతమైన మెట్రో వ్యవస్థగా నిలవనుంది. మరో విశేషమేమిటంటే, ఒకే రైల్వే ట్రాక్‌పై రీజనల్ రైలు (నమో భారత్), లోకల్ మెట్రో (మీరట్ మెట్రో) నడవడం దేశంలో ఇదే తొలిసారి. ఈ కొత్త విధానం పట్టణ రవాణా వ్యవస్థలో ఒక మైలురాయిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రద్దీ తగ్గడంతో పాటు

# ఏపీ లిక్కర్ కేసులో కీలక మలుపు.. వాసుదేవరెడ్డి అరెస్ట్

**ఏపీబీసీఎల్ మాజీ ఎండి వాసుదేవరెడ్డిని అరెస్ట్ చేసిన సీఐడీ**

**ఫైళ్లు, కంప్యూటర్ పరికరాలు, కీలక పత్రాలు చోరీ చేశారంటూ కేసు నమోదు**

**ఇప్పటి వరకు అజ్ఞాతంలో ఉన్న వాసుదేవరెడ్డి**

ఏపీ లిక్కర్ స్కామ్ దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. తాజాగా మరో అరెస్ట్ జరిగింది. ఆంధ్రప్రదేశ్ బెవరేజెస్ కార్పొరేషన్ (ఏపీబీసీఎల్) మాజీ ఎండీ, ఐఆర్టీఎస్ అధికారి వాసుదేవరెడ్డిని సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. వైసీపీ హయాంలో జరిగిన మద్యం స్కాంకు సంబంధించి విజయవాడలోని ఏపీబీసీఎల్ కార్యాలయం నుంచి ఫైళ్లు, కంప్యూటర్ పరికరాలు, కీలక పత్రాలను చోరీ చేశారంటూ ఆయనపై ఫిర్యాదు అందింది. ఈ క్రమంలో ఆయనపై ఆధారాల ధ్వంసం, చోరీ, నేరపూరిత కుట్ర అభియోగాలతో 2024 జూన్‌లో కేసు నమోదు అయింది. ఈ కేసులో ఆయన ఏ2గా ఉన్నారు.హైదరాబాద్‌లోని తన నివాసంలో సీఐడీ సోదాలకు వెళ్లిన సమయంలో వాసుదేవరెడ్డి పరారయ్యారు. అప్పటి నుంచి అజ్ఞాతంలో ఉండగా... తాజాగా సీఐడీ పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు.



RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక



# జిల్లా కలెక్టర్ ను మర్యాదగాపూర్వకంగా కలిసిన మంథని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్





**మంథని,ఫిబ్రవరి 21 (వార్త సంధ్య) :** మంథని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ మరియు వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి శనివారం పెద్దపల్లి కలెక్టరేట్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ని మరియు అడిషనల్ కలెక్టర్ అరుణ శ్రీ ని కలిశారు. జిల్లా కలెక్టర్ చైర్మన్, వైస్ చైర్మన్ కు అభినందనలు తెలిపారు. మంథని మున్సిపాలిటీ అభివృద్ధికై పాలకవర్గానికి సహకరించాలని ఈ సందర్భంగా చైర్మన్ మరియు వైస్ చైర్మన్ ఆయనను కోరారు. పలు అభివృద్ధి పనుల గురించి చర్చించారు.

# టాస్క్ సెంటర్ ను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**ఉచిత శిక్షణ దరఖాస్తుల స్వీకరణ**

**ఫిబ్రవరి 28 లోపు టాస్క్ సెంటర్లో పేరు నమోదు చేసుకోవాలి**



**పెద్దపల్లి, జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 21( వార్త సంధ్య) :** పెద్దపల్లి రీజినల్ టాస్క్ సెంటర్ ను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో టాస్క్ రీజనల్ సెంటర్ ఉచితంగా పలు టెక్నికల్ కోర్సుల్లో శిక్షణ ఇస్తోందని,ఆర్టిసి బస్ డిపో కార్యాలయ ప్రాంగణంలో ఉన్న టాస్క్ సెంటర్లో ఈ శిక్షణ కార్యక్రమాలు అందిస్తామన్నారు. జావా వెబ్ డెవలప్మెంట్, పైథాన్, సీ, సీ, హెచ్‌టిఎంఎల్, సీఎస్ఎస్, జావాస్క్రిప్ట్, టాలీ విత్ జీఎస్టీ, మెడికల్ కోడింగ్ & బిల్లింగ్, ఆప్టిట్యూడ్, రీజనింగ్, సాఫ్ట్ స్కిల్స్ వంటి ముఖ్యమైన కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, టాస్క్ సెంటర్లో శిక్షణ పొందిన వారికి మంచి జీతాలతో ఉద్యోగాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఫిబ్రవరి 28 లోపు టాస్క్ సెంటర్లో పేరు నమోదు చేసుకోవాలని మరింత సమాచారం కోసం 90595 06807 నంబర్లో సంప్రదించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# రాష్ట్రస్థాయి పప్పెట్రీ షోలో గంబీర్‌పూర్ పాఠశాలకు గౌరవం



**దుబ్బాక ప్రతినిధి ఫిబ్రవరి 21(వార్త సంధ్య ):** స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ తెలంగాణ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పప్పెట్రీ షోలో సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం గంభీర్‌పూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి వి. మాధవి ఉత్తమ ప్రదర్శనకు రాష్ట్రస్థాయి కన్సోలేషన్ బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీ జి. బాల్ రాజు సార్ ఆధ్వర్యంలో అభినందన సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో బాల్ రాజు సార్ మాట్లాడుతూ తరగతిగది బోధనలో టీఎల్ఎం వినియోగం వల్ల బోధన సులభతరమై ఆసక్తికరంగా మారుతుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు తరగతులకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా టీఎల్ఎం ఉపయోగించాలని సూచించారు. సన్మాన గ్రహీత శ్రీమతి వి. మాధవి మేడం మాట్లాడుతూ బోధన అంటే తనకు ఎంతో ఇష్టమని, ప్రతిరోజూ ఇంటి వద్దే టీఎల్ఎం తయారుచేసుకొని విద్యార్థుల ఆసక్తి మేరకు బోధన చేస్తున్నానని తెలిపారు. టీఎల్ఎం ద్వారా విద్యార్థులు చక్కగా నేర్చు కుంటున్నారని, తన బోధన పట్ల ఆకర్షితులై ప్రైవేట్ పాఠశాలల నుండి కూడా విద్యార్థులు గంభీర్‌పూర్ ప్రాథ మిక పాఠశాలలో చేరుతున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా పాఠశాల బోధనను మెచ్చుకుంటూ తమ పిల్లలను ఇక్కడ చేర్పిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.ప.ఉ.పా రామక్కపేట ప్రధానో పాధ్యా యులు శ్రీ తిరుపతి సార్, కాంప్లెక్స్ సెక్రటరీ శ్రీ ఆర్. రాంచంద్రారెడ్డి సార్, అలాగే చీకోడు కాంప్లెక్స్ పరిధి లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. గంభీర్‌పూర్ పాఠశాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు రావడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీలో భద్రాద్రి జిల్లాకు సముచిత స్థానం



**భద్రాద్రి జిల్లా బ్యూరో ఫిబ్రవరి 21 (వార్త సంధ్య) :** ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ లో భద్రాద్రి జిల్లాకు సముచిత స్థానం దక్కింది. రాష్ట్ర సమితి సభ్యులుగా జిల్లాకు చెందిన వరక అజిత్, ఎస్ కే షాహీద్, గండాల సుజన్, ఇనంపల్లి సాయి, మాణిక్యాల వినయ్, గగులోతు వంశీ ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర నాల్గవ మహాసభలు నిజాంబాద్ జిల్లా వేదికగా జరిగాయి. ఈ మహాసభల వేదికగా ఈ ఎన్నిక చోటు చేసుకుంది. నూతనంగా విద్యారంగంలో వస్తున్న మార్పులపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఈ మహాసభ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా రాష్ట్రకమిటీకి ఎన్నికైన విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వానికి విద్యారంగం పట్ల సరైన విధానం లేదని, ప్రభుత్వ విద్యారంగ బలోపేతం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోనేలా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని నింపడం కోసం కృషి చేస్తామని, మతోన్మాద భావాజాలాన్ని విద్యాసంస్థల్లో అరికట్టేందుకు పోరాటాలు నిర్వహిస్తామని చెప్పారు. భద్రాద్రి జిల్లా అంటేనే కమ్యూనిస్టులకు కంచుకోటని, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో, జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా సూచనలు, సలహాల మేరకు విద్యారంగ సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు నిర్వహిస్తామన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యం

**- ఎంపీ కేశినేని శివనాథ్**



**కృష్ణజిల్లా బ్యూరో ఫిబ్రవరి 21 వార్త సంధ్య :** జిల్లా పరిధిలోని,విజయవాడ.ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం జరగకూడదనే ఉద్దేశ్యంతో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు పశ్చిమ నియోజకవర్గ టిడిపి నాయకులు తెలిపారు.పశ్చిమ నియోజకవర్గం 35వ డివిజన్ దేవిడ్ వీధి బాపిస్ట్ పాలెం లో ఎంపీ కేశినేని శివనాథ్ ఆదేశాల మేరకు శనివారం ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, పశ్చిమనియోజకవర్గ టిడిపి నాయకులతో కలిసి 35వ డివిజన్ అధ్యక్షులు షేక్ నంద కుమారి ప్రజా దర్బార్ నిర్వహించారు.. ఈ ప్రజాదర్బార్ కి అధిక సంఖ్యలో ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేందుకు తరలిరావటం జరిగింది.టిడిపి నాయకులు ప్రజలతో స్వయంగా మాట్లాడి వారి నుంచి ఆర్జీలు స్వీకరించారు. ప్రతి అర్జీపై సంబంధిత శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరగా, అధికారులు కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు.ఈ ప్రజా దర్బార్ లో రేషన్ కార్డ్ మ్యాపింగ్, కొత్త రేషన్ కార్డ్, టిడ్కో ఇళ్లు, ఇంటి స్థలాలు, వితంతు, ఒంటరి మహిళల పెన్షన్లు, దివ్యాంగుల పెన్షన్లు, ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ సమస్యలు, సీనియర్ సిటిజన్ సమస్యలపై ప్రజలు ఎక్కువగా ఆర్జీలు పెట్టుకున్నారు.ఈ కార్యక్రమంలో నగరల కార్పొరేషన్ డైరెక్టర్ సుకాశి కిరణ్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పాల మాధవ, పశ్చిమ నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు పైడమాల సుభాషిణి, నియోజకవర్గ తెలుగు మహిళా ప్రధానకార్యదర్శి పితాని పద్మ, ఐటీడీపి అధ్యక్షుడు చైతన్య, ప్రధానకార్యదర్శి రమేష్, తెలుగు యువత అధ్యక్షులు ఆర్ మాధవ్, 34 వ డివిజన్ అధ్యక్షులు అద్దూరి కొండ, 52వ డివిజన్ ప్రధాన కార్యదర్శి గోలి శ్రీనివాసరావు, బోసుబాబు , 35వ డివిజన్ కమిటీ సభ్యులు టిడిపి దళిత సీనియర్ నాయ కులు ఇత్తడి చార్లెస్, పైడిమాల రాజు, క్లస్టర్ ఇంచార్జ్ ప్రభుదాసు,కో క్లస్టర్ & మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మైలపల్లి రాజు,కర్రి సునీత, పునురి రవికిషోర్,ఐటీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కొదమల రాజు,యూనిట్ ఇంచార్జి పఠాన్ అసిఫ్, జనసేన ప్రదీప్ రాజు, ఇత్తడి నాగలక్ష్మి, కొట్టేటి సరిత, బంక నాగమణి, సింగపాము భాస్కర్ ,ఎస్సీ సెల్ చిన్నారావు దాస్, పి రాజు, సింగపాము శీలావతి,లక్కు శాంతి, కొసన లక్ష్మి,పూజల శ్రీను పుప్పాల దుర్గ, పట్నాల భార్గవి, దారా రాజేశ్వరి లతో పాటు ప్రభుత్వ శాఖల నుంచి సివిల్ సప్లయ్స్ ఎ.ఎస్.వో, టిడ్కో జె.వో, సచివాలయ సిబ్బంది, పోలీస్ విభాగ సిబ్బంది, హెల్త్ , ఎలక్ట్రిక్ ,కార్పొరేషన్,రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పరిశీలించిన ఎమ్మెల్యే పాయం




**భద్రాద్రి జిల్లా బ్యూరో ఫిబ్రవరి 21(వార్త సంధ్య) :** అశ్వాపురం మండలం లో వివిధ ప్రయివేటు మరియు ప్రభుత్వ కార్యక్రమాలలో భాగంగా జగ్గారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పరిశీలించారు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హౌసింగ్ అధికారులు సూచనలు పాటిస్తూ నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసుకోవాలన్నారు. బిల్లుల విషయంలో జాప్యం లేకుండా లబ్ధిదారుల ఖాతాలో జమ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వచ్చే ఏప్రిల్ నెలలో మళ్ళీ నాలుగు వేల ఇళ్లు నియోజకవర్గం వ్యాప్తంగా లబ్ధిదారులకు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు ఇచ్చే బాధ్యత నాది అని ఈ సందర్భంగా బరోసా కల్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు ఓరుగంటి రమేష్ బాబు, మట్టా వీరభద్రారెడ్డి, బూరెడ్డి వెంకటరెడ్డి, మాదినేని రాంబాబు, సుబ్బారావు, సోడే వెంకటేశ్వర్లు, బాలిన మల్లేష్, తెల్లం వీరభద్రం, వేముల విజయ్, తాటి రాంబాబు, బండారు వెంకటేశ్వర్లు, నూకల సంపత్, కంబాల వెంకన్న, ఆవుల వెంకన్న, పర్శబోయిన సోమలింగం, సోడే నరసింహా రావు తదితరులు పాల్గొన్నారు.

# మసీద్ ను సందర్శించిన ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



**కృష్ణాజిల్లా,బ్యూరో ఫిబ్రవరి , వార్త సంధ్య :** ఎన్టీఆర్ జిల్లా, పరిధిలోని జగ్గయ్యపేట.మండంలోని గంప్రాయి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం, సిసి రోడ్ల శంకుస్థాపనకు విచ్చేసిన ఎంపీ కేశినేని శివనాథ్ శనివారం షేర్ మహమ్మద్ పేట గ్రామంలోని మసీద్ లో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తో కలిసి సందర్శించారు. మత పెద్దలు ఎంపీ కేశినేని శివనాథ్,ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ను ముస్లిం సంప్రదాయ పద్దతుల్లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు ఎంపీ కేశినేని శివనాథ్ దృష్టికి కొన్ని సమస్యలు తీసుకొని రాగా,వాటిని ఒక్కొక్కటిగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తో కలిసి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వారందరికీ ఎంపీ, ఎమ్మెల్యే రంజాన్ శుభాకంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు కరీముల్లా, ఏఎంసీ చైర్మన్ మల్లెల సీతమ్మ, రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కో -కన్వీనర్ ముల్లంగి రామకృష్ణారెడ్డి, జగ్గయ్యపేట మండల పార్టీ అధ్యక్షుడు కట్టా వెంకట నరసింహారావు, టి.ఎన్.టి.యు.సి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, టి.ఎన్.టి.యు.సి జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్ సాయి లతో పాటు షేర్ మహమ్మద్ పేట ముస్లిం మత పెద్దలు, స్థానిక ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.

# కోతుల దాడిలో గాయపడిన బాధితున్ని పరామర్శించిన బోయిని నారాయణ



**మంథని ఫిబ్రవరి 21 (వార్త సంధ్య ) :** మంథని మున్సిపల్ పరిధిలోని కూచిరాజ్ పల్లి 5వ వార్డులో అంబటి రాజ్ కుమార్ అనే వ్యక్తి ఇంటి వద్ద కోతుల గుంపు ఒక్కసారిగా ఆయనపై తీవ్రంగా దాడి చేసి గాయపర్చడం జరిగిందని మంథని మున్సిపల్ పరిధిలోని అనేక వార్డుల్లో ఇలాంటి సంఘటనలు ఎన్నో జరిగినా కూడా వాటి పై చర్యలకు సంబంధిత అధికారులు పట్టించుకోలేదని ఇప్పటికైనా మరొక చోట ఇలాంటి సంఘటన జరగకుండా మంథని మున్సిపల్ నూతన పాలకవర్గం, సంబంధిత అధికారులు వెంటనే కోతుల నివారణకు చర్యలు చేపట్టాలని మంథని మున్సిపల్ 5వ వార్డు బిజెపి కాంటెస్ట్ డ్ అభ్యర్థి బోయిని నారాయణ నూతన పాలకవర్గాన్ని మరియు అధికారులను ఈ సందర్భంగా కోరారు

# సీ.ఎం.రిలీఫ్ ఫండ్ తో ఎంతో మంది పేదలకు లబ్ధి.ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుదీర్ రెడ్డి.



**ఎల్బీనగర్ ప్రతినిధి, ఫిబ్రవరి 21 (వార్త సంధ్య):** బాధిత భర్త సత్యనారాయణ కి రెండు లక్షల పదివేల రూపాయల ఎల్.ఓ.సీ.ఆందజేస్తున్న ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుదీర్ రెడ్డి. హస్తినపురం డివిజన్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీ నందు నివాసం ఉండే అండాలు రక్త బలహీనతలకు సంబంధించిన పలు సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో అయితే వారి యొక్క ఆర్థికస్థితులు బాగలేక వారు వారి యొక్క కుటుంబసభ్యులు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుదీర్ రెడ్డి ని సంప్రదించారు.వెంటనే స్పందించిన సుదీర్ రెడ్డి అట్టి ఆపరేషన్ కు కావలసిన డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిదికి దరఖాస్తు చేయడం జరిగింది.దానికి గాను వారికి 2,10,000(రెండు లక్షల పదివేల రూపాయలు) ఎల్.ఓ.సీ.చెక్కు మంజూరు కావడం జరిగింది.ఈ సందర్భంగా సుదీర్ రెడ్డి మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు సీ.యం.సహాయనిధి దోహదపడుతుంది అని అన్నారు.ఈ పథకం పేదలకు ఓ వరం లాంటిది అని అన్నారు.పేద ప్రజలకు నాణ్యమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు సీ.ఎం.సహాయనిది అండగా ఉంటుంది అని అన్నారు.ఇట్టి కార్యక్రమంలో సీనియర్ భారస నాయకులు ఓరుగంటి వెంకటేష్,చంద్రశేఖర్ రెడ్డి,మల్లేశ్ గౌడ్,పులివెంకట్,పాండు,చందు యాదవ్ పాల్గొన్నారు.

సీ.ఎం.రిలీఫ్ ఫండ్ తో ఎంతో మంది పేదలకు లబ్ధి.ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుదీర్ రెడ్డి.



ఎల్బీనగర్ ప్రతినిధి, ఫిబ్రవరి 21 (వార్త సంధ్య): బాధిత భర్త సత్యనారాయణ కి రెండు లక్షల పదివేల రూపాయల ఎల్.ఓ.సీ.ఆందజేస్తున్న ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుదీర్ రెడ్డి. హస్తినపురం డివిజన్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీ నందు నివాసం ఉండే అండాలు రక్త బలహీనతలకు సంబంధించిన పలు సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో అయితే వారి యొక్క ఆర్థికస్థితులు బాగలేక వారు వారి యొక్క కుటుంబసభ్యులు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుదీర్ రెడ్డి ని సంప్రదించారు.వెంటనే స్పందించిన సుదీర్ రెడ్డి అట్టి ఆపరేషన్ కు కావలసిన డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిదికి దరఖాస్తు చేయడం జరిగింది.దానికి గాను వారికి 2,10,000(రెండు లక్షల పదివేల రూపాయలు) ఎల్.ఓ.సీ.చెక్కు మంజూరు కావడం జరిగింది.ఈ సందర్భంగా సుదీర్ రెడ్డి మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు సీ.యం.సహాయనిధి దోహదపడుతుంది అని అన్నారు.ఈ పథకం పేదలకు ఓ వరం లాంటిది అని అన్నారు.పేద ప్రజలకు నాణ్యమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు సీ.ఎం.సహాయనిది అండగా ఉంటుంది అని అన్నారు.ఇట్టి కార్యక్రమంలో సీనియర్ భారస నాయకులు ఓరుగంటి వెంకటేష్,చంద్రశేఖర్ రెడ్డి,మల్లేశ్ గౌడ్,పులివెంకట్,పాండు,చందు యాదవ్ పాల్గొన్నారు.

# ఎల్ఓసి అందజేత

**2 లక్షల ఎల్ఓసి మంజూరు చేయించిన మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు**



**మంథని, ఫిబ్రవరి 21 (వార్త సంధ్య ) :** తెలంగాణ రాష్ట్ర ఐటి,పరిశ్రమల మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంథని నియోజకవర్గం మంథని మండలంలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన అమ్మకుంటి హారిక కి 2 లక్షల ఎల్ఓసి మంజూరు చేసి ఇప్పించారు. అమ్మకుంటి హారిక కి అనారోగ్య వైద్య చికిత్సకి సంబంధించిన నిమ్స్ ఆసుపత్రి లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నట్లు సహాయం కొరకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి తెలుపగా వెంటనే సీఎంఆర్ఎఫ్ ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తశీ వీరికి 2 లక్షల ఎల్ఓసి మంజూరు చేయించి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆస్పత్రి సహాయకులు హైదరాబాద్ లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో అందజేశారు. అండగా నిలిచిన మంత్రి శ్రీధర్ బాబు కి వారి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు

# ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ

**పేదవారి కలలు నిజం చేస్తున్నాం ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య**




**టేకులపల్లి ప్రతినిధి,ఫిబ్రవరి 21 (వార్త సంధ్య):** టేకులపల్లి మండలంలోని గిరిజనులకు ప్రత్యేకంగా మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య అందించారు. వారు మాట్లాడుతూ "పేదవారి కలలు నిజం చేస్తున్నాం""అర్హులైన ప్రతీ పేదవాళ్ళకి విడతల వారీగా ఇందిరమ్మ ఇల్లు అందిస్తాం. మొదటి విడతగా 881 ఇళ్లను అందించాం, గిరిజనులకు ప్రత్యేకంగా 293 మంది లబ్ధిదారులకు శనివారం అందించడం జరిగింది . ఏప్రిల్ నెలలో మరో విడత ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం ఇవ్వబోతుంది" అని ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు కార్యక్రమంలో ఎంపీడీవో మల్లీశ్వరి , నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్ , మార్కెట్ చైర్మన్ రాంబాబు , మండల అధ్యక్షులు దేవా నాయక్ , ఆత్మ కమిటీ చైర్మన్ మంగీలాల్ , మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, వార్డ్ మెంబర్లు, మాజీ ఎంపీటీసీలు, మహిళా నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఈ నెల 23 నుండి యథావిధిగా ప్రజావాణి కార్యక్రమం



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 21 ( వార్త సంధ్య ) :** రంగారెడ్డి జిల్లా ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 23వ తేదీ (సోమవారం) నుండి యథావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని మున్సిపల్ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో అమలులో ఉన్న ఎన్నికల ప్రవర్తనా నియమావళి కారణంగా తాత్కాలికంగా వాయిదా వేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ప్రజావాణి కార్యక్రమాన్ని తిరిగి యథావిధిగా కొనసాగించనున్నట్లు వెల్లడించారు. ప్రజలు తమ సమస్యలు, వినతిపత్రాలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి త్వరితగతిన పరిష్కారం పొందేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలుస్తుందని కలెక్టర్ తెలిపారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేయాలని ఆయన సూచించారు.

## బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 21 ( వార్త సంధ్య ) :** రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా ప్రతిమా సింగ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌గా కొనసాగుతున్న ప్రతిమా సింగ్ ప్రసూతి సెలవులపై వెళ్లిన విషయం తెలిసిందే. సెలవుల అనంతరం ఫిబ్రవరి 20, 2026 (శుక్రవారం) నాడు తిరిగి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా తన బాధ్యతలను అధికారికంగా స్వీకరించారు. జిల్లా పరిపాలనలో స్థానిక సంస్థలకు సంబంధించిన పలు పరిపాలనా అంశాలపై ఆమె సమన్వయంతో పనులు కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు. ఆమె తిరిగి విధుల్లో చేరడంతో జిల్లా పరిపాలనకు మరింత బలాన్ని చేకూరుతుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

## బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను ఖండిస్తున్నాం

**: కిచ్చనపల్లి నారాయణ ముదిరాజు**



**చేవెళ్ల, ఫిబ్రవరి 21 (వార్త సంధ్య):** బడుగు బలహీన వర్గాల ముద్దుబిడ్డగా, బీసీల ఆత్మగౌరవం కోసం నిరంతరం పోరాటం చేస్తున్న నాయకుడు అని చెప్పుకుంటూ, మెదక్ ఎంపీ రఘునందన్ రావు ప్రదర్శించిన అగ్రకుల అహంకార వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షులు కిచ్చనపల్లి నారాయణ ముదిరాజు అన్నారు. బీజేపీ పార్టీ తరపున గెలిచినా, ఇస్నాపూర్ మున్సిపాలిటీలో ఒక్క కౌన్సిలర్ సీటు కూడా గెలవలేని పరిస్థితిలో డబ్బులకు అమ్ముడై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన అగ్రవర్ణ నేతలు కలిసి బీసీలను అణగదొక్కడానికి ప్రయత్నించడం దురదృష్టకరమని ఆయన విమర్శించారు. నర్సాపూర్‌లో బీజేపీ కౌన్సిలర్లు గెలిచి చైర్మన్ అయ్యే అవకాశం ఉన్నప్పటికీ, అక్కడ తమ ఓటును వినియోగించకుండా ఇస్నాపూర్‌కు వచ్చి బడుగు బలహీన వర్గాలకు వ్యతిరేకంగా ఓటు వేయడం ద్వారా నీలం కవితను ఇస్నాపూర్ మున్సిపాలిటీ చైర్మన్ కాకుండా చేయడానికి కుట్రపూరితంగా వ్యవహరించారని ఆరోపించారు. ఈ చర్యలను మేము తీవ్రంగా నిరసిస్తూ, రాబోయే రోజుల్లో బీసీలు మరియు సబ్బండ వర్గాలు ఏకమై తమ సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. మన బీసీ బిడ్డకు జరిగిన అన్యాయంపై అన్ని సబ్బండ వర్గాలు ఏకతాటిపైకి వచ్చి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షులు కిచ్చనపల్లి నారాయణ ముదిరాజు, అధ్యక్షులు మైసయ్య ముదిరాజ్, ఉపాధ్యక్షులు మన్నే వెంకటేష్ ముదిరాజు, జనరల్ సెక్రటరీ కావలి శ్రీకాంత్ ముదిరాజ్, ట్రెజరర్ ఎర్రోళ్ల నరేష్ ముదిరాజ్, సెక్రటరీలు సారా రాములు ముదిరాజు, నడికుడి జంగయ్య ముదిరాజు, సలహాదారులు శ్రీనివాస్ ముదిరాజు, మాణిక్యం ముదిరాజు తదితరులు పాల్గొన్నారు

## నేడు లక్ష్మి నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం.



**జగిత్యాల జిల్లా బ్యూరో రిపోర్టర్ ఫిబ్రవరి 21(వార్త సంధ్య):** జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని భూపతిపూర్ గ్రామంలో ఆదివారం రోజు నక్కలగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం, మహా అన్నదానం, రథోత్సవ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో, గ్రామ ప్రజల సౌజన్యంతో ఏర్పాట్లు పూర్తి అయ్యాయని అర్చకులు వెంకట కృష్ణ తెలిపారు. ఆదివారం రోజున జరిగే శ్రీ లక్ష్మి నరసింహస్వామి కళ్యాణ మహోత్సవ కార్యక్రమం, మహా అన్నదాన కార్యక్రమం,రథోత్సవ కార్యక్రమాలకి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకి పాత్రులు కాగలరని నిర్వాహకులు గ్రామ పంచాయతీ పాలకవర్గం వారు కోరారు. వీరు మాట్లాడుతూ యాచమనేని గంగారావు -రాధమ్మ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు అన్నదాన వితరణకి, బహ్మోత్సవాలు మొదలైన రోజు నుండి భక్తులకి యువ మిత్ర యూత్ వారు త్రాగు నీరు అందించారని తెలిపారు. వీరికి గ్రామ పాలక వర్గం తరుపున, గ్రామ ప్రజల తరుపున సర్పంచ్ గుర్రం భావన మహేందర్ ఉప సర్పంచ్ మూగల సంజీవ చారి కృతజ్ఞతలు తెలిపారు.

## వార్డు సభ్యులకు 5 రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమం



దుబ్బాక ప్రతినిధి ఫిబ్రవరి 21 ( వార్త సంధ్య ) : సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం లో తెలంగాణ పంచాయతీ రాజ్ యాక్ట్ , 2018 ప్రకారం గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు 5 రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. వార్డు సభ్యుల అధికారాలు, విధులు, బాధ్యతలపై సమగ్ర అవగాహన కల్పించడం ఈ శిక్షణ ప్రధాన లక్ష్యంగా నిర్వహించారు. మండల ఎంపీడీఓ భాస్కర శర్మ మాట్లాడుతూ, వార్డుల్లో పారిశుద్ధ్యం, వీధి దీపాలు, తాగునీటి సరఫరా వంటి ప్రాథమిక సౌకర్యాల పర్యవేక్షణలో వార్డు సభ్యులు చురుకుగా వ్యవహరించాలని సూచించారు. గ్రామ సభల్లో పాల్గొని అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి, ప్రభుత్వ పథకాలను అర్హులకు చేరవేయడంలో వార్డు సభ్యులు బాధ్యతగా ఉండాలని తెలిపారు. ప్రజలకు మరియు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తూ తమ తమ వార్డుల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వార్డు సభ్యులు పాల్గొని శిక్షణను విజయవంతం చేశారు

## దేవుడి చిత్రపటాలతో రాజకీయాలు తగవు ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ

**ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో జిల్లా ఎన్డీయే కూటమి నేతలు మీడియా సమావేశం**

**వైసీపీ తీరుపై కూటమి నేతల ఆగ్రహం**

**హిందువుల మనోభావాలను వైసిపి ఎమ్మెల్సీలు దెబ్బ తీశారు**

**నాడు డబ్బు కోసం.నేడు రాజకీయ మనుగడ కోసం శ్రీవారి అడ్డుపెట్టుకుంటున్న వైసిపి**



**కృష్ణాజిల్లా ,బ్యూరో ఫిబ్రవరి 21, వార్త సంధ్య :** విజయవాడ,శాసన మండలిలో వైసీపీ ఎమ్మెల్సీలు శ్రీ వెంకటేశ్వర స్వామి చిత్రపటాలను రాజకీయ ప్లకార్డుల్లా ఉపయోగించడం, అనంతరం వాటిని నిర్లక్ష్యంగా వదిలేయడం సరికాదని, చిత్రపటాలతో రాజకీయాలు తగవని ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గద్దె అనురాధ విమర్శించారు. శాసన మండలిలో వైసీపీ సభ్యులు తీరును నిరసిస్తూ శనివారం గురునానక్ కాలనీలోని ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, జనసేన నాయకులు గాదిరెడ్డి అమ్ములు, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన చిట్టిబాబు, ఏపీ బిల్డింగ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, రాష్ట్ర నాగవంశం సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఎరుబోతు రమణారావు లతో కలిసి ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ మీడియా సమావేశం నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు గద్దె అనురాధ మాట్లాడుతూ శ్రీవారి దేవుడి చిత్రాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. హిందువుల ఆరాధ్య దైవాల చిత్రపటాలను శాసన మండలిలో ప్లకార్డుల్లా ప్రదర్శించి, నిరసన ముగిసిన తరువాత ఆ చిత్రాలను కుర్చీలు, టేబుళ్లపై వదిలేసి వెళ్లిపోవడం మరింత అవమానకరమని ఆమె విమర్శించారు. నాడు అధికార దుర్వినియోగం, నేడు రాజకీయ మనుగడ కోసం దేవుడిని అడ్డం పెట్టుకుని నాటకాలు ఆడుతున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో టీటీడీ లడ్డును కల్తీ చేసి కళ్లకు అద్దుకుని తినే ప్రసాదాన్ని అనుమానంతో తినేలా చేశారని, టీటీడీ దేవస్థానంలో అన్యమత ప్రచారం చేశారన్నారు. జగన్ తన సొంత పిన్నితో జగన్ రక్షక గోవిందా అని ఏకంగా తిరుమల తిరుపతి దేవస్థానంలో అనిపించుకున్నారని, దీన్ని బట్టే వారికి హిందూ మతంపై ఎటువంటి గౌరవం ఉందో తెలుస్తుంది అన్నారు. 42 ఏళ్ల క్రితం సిక్కులు ఎంతో పవిత్రంగా భావించే అమృత్ సర్ లోని స్వర్ణదేవాలయంలో దాగిన మిలిటెంట్లను పట్టుకునేందుకు ఆపరేషన్ బ్లూ స్టార్ నిర్వహిస్తే.. ఆ తర్వాత పర్యవసానాలు అందరికి తెలుసునన్నారు. మత విశ్వాసాలను ఎప్పుడైనా గౌరవించాలని హితవు పలికారు. వైసిపి ఎమ్మెల్సీలు ఇప్పటికైనా చేసిన తప్పును ఒప్పుకుని హిందూ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని గద్దె అనురాధ డిమాండ్ చేశారు. బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ దేవదేవుని చిత్రాలను రాజకీయ వేదికగా మార్చడం వైసీపీ నేతల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. జగన్ డైరెక్షన్‌లో వైసీపీ ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరు అత్యంత బాధాకరమని విమర్శించారు. ప్రజలు ఇప్పటికే తగిన తీర్పు ఇచ్చారని, అయినా వైసీపీ నాయకత్వం మార్పు చూపడం లేదన్నారు. శాసన మండలిలో జరిగిన ఘటనపై చైర్మన్ తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మతాన్ని రాజకీయ ఆయుధంగా మార్చడం మానుకుని రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టాలని, లేదంటే ప్రజలే మళ్లీ గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. జనసేన నేత గాదిరెడ్డి అమ్ములు మాట్లాడుతూ, హిందూ మత విశ్వాసాలను కించపరిచే విధంగా వ్యవహరించడం ప్రజలు సహించరన్నారు. దేవుడి చిత్రాలను ప్లకార్డులుగా ఉపయోగించడం మాత్రమే కాకుండా, వాటిని నిర్లక్ష్యంగా విసిరేయడం హిందువుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిందని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన చిట్టిబాబు మాట్లాడుతూ తప్పు చేసి దొరికిపోయిన తర్వాత కూడా రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. వైసీపీ నేతలు బహిరంగ క్షమాపణలు చెప్పి తమ తప్పును ఒప్పుకోవాలి" అని ఆయన డిమాండ్ చేశారు. . భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు శాసనమండలిలోనే కాదు అసెంబ్లీ లో కూడా పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని కోరారు. దేవాలయాల పవిత్రతను, మత విశ్వాసాలను కాపాడటం తమ బాధ్యతగా భావిస్తున్నామని, ప్రజల్లోకి నిజాలు తీసుకెళ్లి వైసీపీ ద్వంద్వ వైఖరిని బయటపెడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బిజెపి తూర్పు నియోజకవర్గ ఇన్చార్జ్ కోలపల్లి గణేష్, ఎన్టీఆర్ జిల్లా బిజెపి వైస్ ప్రెసిడెంట్ నున్న కృష్ణ, విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయం బోర్డ్ మెంబర్ అవ్వారు బుల్లాబ్బాయి లతో తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ జగన్‌కు ఎక్కడ మంచి పేరొస్తుందనే ఆ ప్రాజెక్టును పూర్తి చేయలేదా.. పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి







**- రాయలసీమకు చంద్రబాబు తీరని ద్రోహం.. గడికోట శ్రీకాంత్ రెడ్డి**

**- రాయలసీమకు న్యాయం జరిగేంతవరకు పోరాటం..**

**- చంద్రబాబు మోసపూరిత నైజాన్ని ఎండగట్టుతాం.. ఆకే పాటి అమర్ నాథ్ రెడ్డి**

**- రాయలసీమకు చంద్రబాబు చేస్తున్న కుట్రలనూ ప్రతి గడప గడపకూ వివరించే కార్యక్రమం చేపడతాం.. నిస్సార్ అహ్మద్**

**- చంద్రబాబు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 3వ బడ్జెట్ లో కూడా అన్ని వర్గాల ప్రజలకు వెన్నుపోటే.. సురేష్ బాబు, రమేష్ రెడ్డి**

**అన్నమయ్య జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 21 - ( వార్త సంధ్య ) :** శ్రీ శైలం జలాశయం నుండి రాయలసీమ కు అందాల్సిన కృష్ణ జలాలు తెలంగాణకు తరలిపోవడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనుసరిస్తున్న విధి విధానాలను వ్యతిరేకిస్తూ జిల్లా పార్టీ అధ్యక్షుడు శాసనసభ్యులు ఆకేపాటి అమరనాథ్ రెడ్డి సమావేశం జరిగింది. చంద్రబాబు తన స్వార్థ రాజకీయాల కోసం రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌ను నిలిపివేయడంతో రైతులు ఆగ్రహంతో ఉన్నారని వైయస్ఆర్‌సీపీ నేతలు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయించే దిశగా వైయస్ఆర్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన పోరాట కార్యక్రమాలపై శనివారం రాయచోటిలోని వైయస్ఆర్‌సీపీ పార్టీ కార్యాలయంలో ముఖ్య నేతల కలయికతో సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశానికి రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి, తంబళ్లపల్లి శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు గడికోట శ్రీకాంత్ రెడ్డి, నిస్సార్ అహ్మద్, కడప మేయర్ సురేష్ బాబు, రమేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాత్రికేయుల సమావేశంలో పలువురు పార్టీ నేతలు మాట్లాడారు. ఈ సందర్భంగా నిస్సార్ అహమ్మద్ మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు రాయలసీమకు న్యాయం జరిగే వరకు వైయస్ఆర్‌సీపీ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగం పట్ల చంద్రబాబు నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా విమర్శించారు. రాయలసీమతో పాటు నెల్లూరు జిల్లాలకు పోతిరెడ్డిపాడు ప్రాణవాయువు లాంటిదని, ఈ ప్రాజెక్టును నిర్వీర్యం చేయడం ద్వారా మొత్తం రాష్ట్రానికే అన్యాయం జరుగుతుందని అన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేయకపోతే రాబోయే రోజుల్లో మరింత ఉధృతంగా ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందేమోనని కూటమి నేతలు భావించి ఆ ప్రాజెక్టును పూర్తి చేయలేదని స్వప్రయోజనాల కోసం చంద్రబాబు సీమ ప్రజల గొంతు కోస్తున్నారని ద్వారకానాథ్ రెడ్డి విమర్శించారు. కరువు పీడిత రాయలసీమ ప్రాంతానికి రాయలసీమ ఎత్తిపోతల పథకం జీవనాడి వంటి ప్రాజెక్టు అని ద్వారకానాథ్ రెడ్డి అన్నారు. రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని రైతులకు అతిపెద్ద కష్టం రాబోతుందని ముందుగానే జోష్యం చెప్పారు. సీఎం చంద్రబాబుకు సాగునీరంటే పట్టింపు లేదని, వ్యవసాయమంటేనే దండగ అన్న చంద్రబాబు అదే ధోరణిలో ఉన్నారన్నారు. స్వప్రయోజనాలు తప్ప ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రజా సమస్యలపై మాట్లాడలేని ఉప ముఖ్యమంత్రిగా మనకున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో చంద్రబాబు కుమ్మక్కై ప్రాజెక్టును ఆపేయడం దారుణమన్నారు. బాబు స్వప్రయోజనాల కోసం సీమ ప్రజల గొంతు నులమడం అన్యాయమన్నారు. రాయలసీమకు చంద్రబాబు తీరని ద్రోహం చేస్తున్నారని వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి ధ్వజమెత్తారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చంద్రబాబు చేతులు కలిపి రాష్ట్రానికి, రాయలసీమకు మరణశాసనం రాశారని శ్రీకాంత్ రెడ్డి ఆరోపించారు. తన స్వార్థం కోసం, లాలూచీపడి రాయలసీమ ప్రాంతానికి వెన్నుపోటు పొడిచారన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తో రహస్య ఒప్పందం కుదుర్చుకుని రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్ట్ ను ఆపేశారని, ఈ విషయాన్ని స్వయంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నే ఆ రాష్ట్ర అసెంబ్లీలో స్వయంగా వెల్లడించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఒక ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి తన సొంత రాష్ట్రాన్ని ఈ రకంగా తాకట్టు పెట్టడం, రాష్ట్ర ప్రయోజాలను ఈ రకంగా తన స్వార్థంకోసం అమ్ముకోవడం బహుశా దేశ చరిత్రలో ఎక్కడా చూసి ఉండరన్నారు. చంద్రబాబు వల్లే ఆరోజు రాష్ట్రానికి ఆల్మట్టి రూపంలో ఒక శాపం వచ్చిందని, కేంద్రం కట్టాల్సిన పోలవరం ప్రాజెక్ట్ ను కాంట్రాక్టర్ల కోసం దోచుకోవడం కోసం, కమీషన్ల కోసం ప్రత్యేక హోదాను తాకట్టుపెట్టి తన చేతిలోకి తీసుకున్నాడని, ఇవాళ రాయలసీమ లిఫ్ట్ ను కూడా తన స్వార్థంకోసం ఆపేశాడన్నారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలో ఉన్నా ఇలా రాష్ట్రాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీస్తూనే ఉన్నాడని శ్రీకాంత్ రెడ్డి దుయ్యబట్టారు. శ్రీశైలం నుంచి రాయలసీమకు, నెల్లూరు జిల్లాకు, ఉమ్మడి ప్రకాశం జిల్లా లోని వెలిగొండ కు చెన్నై తాగునీటి అవసరాలకు నీళ్లు తీసుకునేందుకు ఏర్పాటు చేసిన పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ 854 అడుగులవరకు ఏర్పాటు చేశారని 881 కన్నా ఎక్కువ ఎత్తులో నీరు ఉంటేనే పోతిరెడ్డి పాడు నుంచి పూర్తిస్థాయిలో నీళ్లు వస్తాయన్నారు. 841 అడుగులు ఉంటే కేవలం 2వేల క్యూసెక్కులు మాత్రమే నీళ్లు తీసుకునే వీలుందని 854 అడుగులు ఉంటే 7వేల క్యూసెక్కులు, వీలుంటుందన్నారు. మరో వైపు తెలంగాణ రాష్ట్రం 787 అడుగుల నుంచే విద్యుత్ ఉత్పత్తిద్వారా నీటిని కిందకు వదిలేస్తోందని, అంతేకాక శ్రీశైలం నుంచి 800 అడుగులనుంచే నీళ్లు ఎత్తిపోసేందుకు తెలంగాణ రాష్ట్రం పలు ప్రాజెక్టులు చేపట్టిందన్నారు. పాలమూరు రంగారెడ్డి సహా డిండి, కల్వకుర్తి, ఎస్ఎల్ బీసీ ద్వారా ప్రాజెక్టుల ద్వారా పెద్ద ఎత్తున నీటిని తీసుకెళ్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాడు అధికారంలో ఉన్న చంద్రబాబు నోరు మెదపలేదన్నారు. ఓటుకు నోటు కేసులో పూర్తిగా ఇరుక్కుపోయి, హైదరాబాద్ మీద పదేళ్లపాటు మనకు అధికారం ఉన్నా సరే పారిపోయి వచ్చి, ఇక్కడ కరకట్టలో దాక్కున్నాడని శ్రీకాంత్ రెడ్డి ఎద్దేవ చేశారు. రాష్ట్ర ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగించే తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకునే ప్రయత్నం చేయలేదన్నారు. దీనివల్ల రాయలసీమ ప్రాంతానికి తాగునీటికి, సాగునీటికి తీవ్ర కొరతను దృష్టిలో ఉంచుకుని వైయస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను, రాయలసీమ ప్రయోజనాలను కాపాడేందుకు వ్యూహాత్మకంగా, విప్లవాత్మకం గా నిర్ణయం తీసుకుని రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును మొదలు పెట్టారన్నారు. శ్రీశైలంలో 800 అడుగుల నుంచే రోజుకు 3 టీఎంసీల నీటిని తీసుకునేందుకు రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ను జోరుగా ముందుకు తీసుకెళ్లారన్నారు. వైయస్ జగన్ మోహన్ రెడ్డికి ఎక్కడ మంచి పేరొస్తుందని గత ప్రభుత్వంలో చంద్రబాబు తెలంగాణలో ఉన్న తన టీడీపీ కార్యకర్తల ద్వారా కేసులు వేయించి అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు. అయినా సరే రాయలసీమ తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్టును ముందుకు కొనసాగిందని ప్రభుత్వం మారిన తర్వాత ఈ ప్రాజెక్టు పూర్తిగా పడకేసిందన్నారు. రాష్ట్రానికి, రాయలసీమ ప్రాంతానికి చంద్రబాబు చేసిన దుర్మార్గాన్ని ఖండిస్తున్నా మన్నారు. ఇంతటి అన్యాయం చేసిన చంద్రబాబును ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించరన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చడం లేదు..

రాష్ట్రంలో ఏ మాత్రం సంక్షేమ పథకాలు అందివ్వడం లేదన్నారు. పసిపిల్లలపై అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదన్నారు. రాయలసీమ ప్రాంత అభివృద్ధికి బడ్జెట్ లో నిధులు కేటాయించడం లేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను, అక్రమాలను ప్రశ్నించిన వారిపైనే అక్రమ కేసులు పెట్టుచున్నారన్నారు.

స్వార్థ రాజకీయాల కోసం దేవుణ్ణి చంద్రబాబు వదలడం లేదు..

స్వార్థ రాజకీయాల కోసం దేవుణ్ణి చంద్రబాబు వదలడం లేదన్నారు. వైయస్ఆర్‌సీపీ హయాంలో లడ్డూలో కల్తీ జరిగిందని దుష్ప్రచారం చేసి వాళ్లే అభాసుపాలయ్యారన్నారు. 2014-2019 కాలంలోనే లడ్డూ లో కల్తీ జరిగినట్లుగా ఆధారాలు బయట పడుతున్నాయన్నారు. మార్చి 1న రాయలసీమకు జరుగుతున్న అన్యాయంపై కడపలో గ్రేటర్ రాయలసీమ స్థాయి సమావేశం..

మార్చి 1న కడపలో గ్రేటర్ రాయలసీమ స్థాయి సమావేశం నిర్వహించడం జరుగుతోందన్నారు. రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్ట్ పై రైతులు, ప్రజలకు అవగాహన కల్పన, రాయలసీమ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కొనడానికి ఉద్యమ కార్యాచరణ, పోరాట స్ఫూర్తిపై చర్చించడం జరుగుతుందన్నారు. రాయలసీమ ప్రాంతంలోని రైతులు, ప్రజలు, మేధావులు, యువత, విద్యార్థులు , ప్రజా సంఘాలు, పార్టీలకతీతంగా అన్ని రాజకీయ పార్టీలు పాల్గొనాలని గడికోట శ్రీకాంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## ముచ్చింతల్‌లో నూతన సర్పంచ్‌ల శిక్షణా కార్యక్రమం విజయవంతం

**సర్పంచులకు శిక్షణ సర్టిఫికెట్లు అందించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**





**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 21 ( వార్త సంధ్య ) :** రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నూతన సర్పంచ్‌ల శిక్షణా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం, మంచాల్, యాచారం మండలాలు మరియు రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన శంషాబాద్ మండల సర్పంచ్‌లకు ఫిబ్రవరి 17-02-2026 నుండి 21-02-2026 వరకు ప్రత్యేక శిక్షణ అందించారు. ఈ శిక్షణా కార్యక్రమం శంషాబాద్ మండలంలోని ముచ్చింతల్ గ్రామ పంచాయతీ పరిధిలోని స్వర్ణ భారత్ ట్రస్ట్ ప్రాంగణంలో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో జరిగింది. గ్రామ పంచాయతీ పరిపాలన, ఆర్థిక నిర్వహణ,



ఉపాధి హామీ పథకం అమలు వంటి కీలక అంశాలపై సమగ్ర శిక్షణ అందించారు. శిక్షణా కార్యక్రమం ముగింపు సభకు ముఖ్య అతిథిగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి హాజరై సర్పంచ్‌లను ఉద్దేశించి ప్రసంగించారు. గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర అత్యంత కీలకమని, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసిన సర్పంచ్‌లకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి (డిపిఓ) సురేష్ మోహన్ సర్పంచ్‌లకు పంచాయతీ పరిపాలన, ఆర్థిక నిర్వహణ, ఉపాధి హామీ పథకం అమలు తదితర అంశాలపై మార్గదర్శకాలు అందించారు. టి ఓ టి లుగా ముగ్గురు డి ఎల్ పి ఓ లు, ఇద్దరు ఎంపీడీవో లు, ఇద్దరు ఎంపీ ఓ లు, ఒక ఈ జి ఎస్ ఈ సి మరియు టి ఏ లు పాల్గొని శిక్షణను సమర్థవంతంగా నిర్వహించారు. శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగియగా, పాల్గొన్న నూతన సర్పంచ్‌లు తమ బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు.

# ధరణి పోర్టల్‌లో కోడ్ ఆడిటింగ్ - ఇక అక్రమాలకు చెక్

**ధరణి పోర్టల్‌లో అక్రమాలకు చెక్ పేట్టేలా ప్రభుత్వం చర్యలు**

**జనగామ, యాదాద్రి జిల్లాల్లో స్టాంపు డ్యూటీ, చలాన్ల డబ్బు దారి మళ్లింపు ఘటనలతో అప్రమత్తం**

**మళ్లీ జరగకుండా కోడ్ ఆడిటింగ్‌కు నిర్ణయం**




ధరణి పోర్టల్‌లో అక్రమాలకు చెక్ పెట్టేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా కోడ్ ఆడిటింగ్ చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సీ- డాక్‌కి బాధ్యతలు అప్పగించింది.ధరణి పోర్టల్‌లో లోతైన ఆడిటింగ్ వ్యవస్థ తీసుకొచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. కోడ్ ఆడిటింగ్ ఏర్పాటు చేసేందుకు సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్-సి-డాక్‌కు బాధ్యతలు అప్పగించింది. తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ - టీజీఎస్ఎస్ (౧+టూా) నేతృత్వంలో సి-డాక్ కోడ్ ఆడిటింగ్‌ను చేపట్టనున్నారు. భూ భారతి పోర్టల్లో ఇటీవల యాదాద్రి-భువనగిరి, జనగామ జిల్లాల కేంద్రంగా స్టాంపు డ్యూటీ, చలాన్ల నగదును కొందరు దారి మళ్లించిన విషయయం తెలిసిందే. ఆ విషయంపై విచారణకు ఏర్పాటు చేసిన హైలెవల్ కమిటీ మరిన్ని లోతైన విషయాలు గుర్తించింది. ధరణి పోర్టల్ ఏర్పాటు నాటి నుంచి కొన్ని రక్షణపరమైన లోపాలు లేవంటూ రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి ఆ కమిటీ తీసుకొచ్చింది. దీంతో పోర్టల్‌ను మరింత పకడ్బందీగా తయారు చేయాలని మంత్రి పొంగులేటి ఆదేశాలు జారీ చేశారు.పోర్టల్‌ను మరింత బలోపేతం చేసేలా సాఫ్ట్‌వేర్ రంగంలో పరిశోధన-అభివృద్ధి-ఆర్అండ్‌డీలో పట్టున్న కేంద్రప్రభుత్వ సంస్థ సి-డాక్‌కి బాధ్యతలు బాధ్యతలు అప్పగించారు. సాఫ్ట్‌వేర్ సమస్యలు, పరిష్కారాలు, డేటా భద్రతపై ఆ సంస్థ సేవలను రెవెన్యూశాఖ తీసుకోనుంది. ధరణి సాఫ్ట్‌వేర్ రూపొందించిన ప్రైవేట్ సంస్థ గతంలో రక్షణ చర్యలపై దృష్టిసారించలేదని కోడ్ ఆడిటింగ్ లాంటి వ్యవస్థలను ఏర్పాటు చేసుకోలేదని గుర్తించారు. రహస్యంగా లాగిన్లను తెరిచి ప్రభుత్వ భూములను కొల్లగొట్టడం వంటి అక్రమాలకు ఇదొక కారణమని రెవెన్యూ శాఖ అభిప్రాయపడుతోంది. 2020 సంవత్సరం అక్టోబరు నుంచి ధరణి అమల్లోకి రాగా అప్పటి నుంచే సరైన రక్షణ వ్యవస్థలు లేవని, 2024 సంవత్సరం చివరలో టెర్రా ఐసిస్ నుంచి ఎన్ఐసీకి భూముల డేటా బదిలీ చేసిన సమయంలో గుర్తించలేకపోయిందని రెవెన్యూ వర్గాలు పేర్కొంటున్నాయి.దాదాపు 75 లక్షల మందికిపైగా రైతులు సుమారు 1.60 కోట్ల ఎకరాల భూములు, లక్షల ఎకరాల ప్రభుత్వ భూముల డేటా నిర్వహణ ఈ పోర్టల్ ద్వారా జరుగుతోంది. రోజుకు సగటున 40 వేల లావాదేవీలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో డేటాలో ఏవైనా లోపాలు సమస్యలు వస్తే వాటిని సమీక్షించేందుకు ప్రభుత్వ పరంగా ఒక నిపుణుల వ్యవస్థ లేదు. డేటా నిర్వహణ చేపడుతుండగా సాంకేతికతపై లోతైన అవగాహన, సమీక్షించే నేర్పున్న నిపుణుల అవసరాన్ని ఇటీవల జనగామ ఘటన నొక్కిచెప్పింది. లోపాలు వెలుగు చూసినప్పుడు కమిటీలు వేసి తేల్చడం కన్నా ఏ వ్యవస్థలు అవసరమో గుర్తించి అప్రమత్తం చేసేలా ఒక వింగ్ ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

# అబ్దుల్లాపూర్ మెట్టు శివారులో జోరుగా ఇటుక బట్టీల దందా







**మొదటిపేజీ తరువాయి** - ఏర్పాటవుతున్నాయనే సమాచారం వెలుగులోకి వస్తోంది. ఇది భూసంరక్షణ చట్టాలకు విరుద్ధమని ప్రజలు చెబుతున్నారు. తాత్కాలిక నిర్మాణాల పేరుతో శాశ్వత వ్యాపారం సాగించడం ద్వారా చట్టాలను మోసం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమంగా నడుస్తున్న ఇటుక బట్టీల వల్ల ప్రభుత్వానికి ఆదాయ నష్టం కూడా కలుగుతోందని నిపుణులు పేర్కొంటున్నారు. సరైన రిజిస్ట్రేషన్ లేకుండా ఉత్పత్తి, విక్రయం కొనసాగుతుండటంతో పన్నులు, రాయల్టీలు తప్పించుకుంటున్నారని సమాచారం. ఇది ప్రభుత్వ ఖజానాపై ప్రభావం చూపే అంశమని అధికారులు కూడా గుర్తించాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఈ నేపథ్యంలో అబ్దుల్లాపూర్ మెట్టు పరిసరాల్లో అక్రమ ఇటుక బట్టీలపై ప్రత్యేక దర్యాప్తు జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రెవెన్యూ, మైనింగ్, కాలుష్య నియంత్రణ, స్థానిక పరిపాలన శాఖలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి చట్ట విరుద్ధంగా నడుస్తున్న బట్టీలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.మొత్తానికి, అబ్దుల్లాపూర్ మెట్టు శివారులో విస్తరిస్తున్న అక్రమ ఇటుక బట్టీల దందా రోజురోజుకూ పెరుగుతూ నియంత్రణకు సవాలుగా మారుతోంది. తక్షణమే సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని అక్రమ కార్యకలాపాలను అరికట్టకపోతే భవిష్యత్తులో ఈ దందా మరింత విస్తరించే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# క్యూ ఆర్ కోడ్‌తో డ్రైవింగ్ లైసెన్స్

**చిప్‌తో ఉన్న కార్డుల కంటే ఇవే బెటర్**

**డ్రైవింగ్ లైసెన్స్‌కు క్యూఆర్ కోడ్‌తో ఉన్న కొత్త తరహా స్మార్ట్ కార్డులు**

**చిప్‌తో కూడిన కార్డుల కంటే ఇవే మేలని నిర్ణయం**

**వీటి సరఫరా నుంచి డెలివరీ వరకు గుత్తేదారుదే బాధ్యత**




వాహనాల రిజిస్ట్రేషన్ (ఆర్‌సీ), డ్రైవింగ్ లైసెన్స్ (డీఎల్), కార్డులుగా ఇక నుంచి క్యూఆర్ కోడ్‌తో ఉన్న కొత్త తరహా స్మార్ట్ కార్డులను త్వరలో రవాణాశాఖ జారీ చేయనుంది. దీనికి సంబంధించి చిప్‌తో కూడిన స్మార్ట్‌కార్డ్, చిప్ లేకుండా క్యూఆర్ కోడ్‌తో ఉన్న స్మార్ట్ కార్డులలో ఏది ఇవ్వాలనే దానిపై ప్రస్తుతం కసరత్తు జరుగుతుంది. ఈ ప్రక్రియ అనంతరం క్యూఆర్ కోడ్ కార్డులపై మొగ్గుచూపారు. దీంతో 2024 అక్టోబర్ నుంచి పెండింగ్ ఉన్న కార్డులన్నీ జారీ కానున్నాయి.ఏపీలో రోజుకు దాదాపు సగటున 8 నుంచి 10 వేల ఆర్‌సీ, డీఎల్ కార్డులనేవి అవసరమవుతాయి. దీనికి సంబంధించి వీటిలో ఒక్కో కార్డుకు రూ.200 ఫీజుతో పాటుగా తపాలా పోస్టు ద్వారా చేరవేసేందుకు మరో రూ.35 కలిపి మొత్తంగా రూ.235 చొప్పున రవాణాశాఖ వసూలు చేస్తుంది.అయితే వైఎస్సార్సీపీ హయాంలో బకాయిలను చెల్లించకపోవడం వల్ల మధ్య మధ్యలో స్మార్ట్ కార్డుల పంపిణీని నిలిపివేసేవారు. దాంతో దీని ఫలితంగా లక్షల సంఖ్యలో ఎన్నో కార్డులు పెండింగ్‌లోనే ఉండేవి.కానీ చివరకు అంటే 2023 ఆగస్టు 1వ తేదీ నుంచి స్మార్ట్ కార్డుల జారీనే ఆ పేశారంటే పరిస్థితి ఏ రీతిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే గత సాధారణ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు అన్ని ఇతర రాష్ట్రాల్లో స్మార్ట్ కార్డుల జారీ అనేది ఉండటం వల్ల వీటిని మళ్లీ ఇవ్వాలని నిర్ణయాన్ని తీసుకున్నారు. దీని ప్రకారం 2024 అక్టోబర్ 1వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ కలిగి ఉన్న వాహనాలను, అదే విధంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందిన వారికి ఆర్‌సీ, డీఎల్ స్మార్ట్‌కార్డులను జారీ చేసేందుకు ఫీజులను వసూలు చేయడం ఆరంభించింది ఏపీ రవాణాశాఖ.నిబంధనలు ఇలా! అయితే ఈ విధానంలో చిప్‌తో కూడినటువంటి స్మార్ట్ కార్డులను ఇవ్వాలా? లేదా చిప్ లేకుండా క్యూఆర్ కోడ్‌తో ఉన్న కార్డులను ఇవ్వాలా అనేదానిపైన మాత్రం ఇప్పటి వరకు ఎన్నో చర్చలు జరిగాయి. కానీ చిప్ స్మార్ట్ కార్డుల్లోని డేటా ఏంటని తెలియాలంటే మాత్రం చిప్ రీడర్లు కావాలి. అందుకు గాను రవాణా శాఖ వీటిని కొనుగోలు చేయాల్సి ఉంటుంది.ఒకవేళ చిప్‌లేని క్యూఆర్ కోడ్‌తో కూడినటువంటి కార్డుల్లో కేంద్ర రవాణాశాఖకు చెందిన మోహన్, పరివాహన్ పోర్టల్‌తో అనుసంధానం కావడంతో ధృ వీకరణ సమాచారం అనేది ఉంటుంది. దీనికి గాను చిప్‌తో కూడిన ఒక్కో కార్డుకు రూ.57. ప్రింటింగ్ ఖర్చులు, పోస్టల్ ఖర్చులన్నింటితో కలిపి మొత్తంగా రూ.115 వరకు వ్యయం అవుతుందిఒకవేళ అలా కాకుండా క్యూఆర్ కోడ్‌తో ఉండేటటువంటి కార్డులకు రూ.72 వరకు ఖర్చు అవుతోంది. దాంతో వీటన్నింటినీ గమనించిన వాహనదారులు క్యూఆర్ కోడ్ స్మార్ట్ కార్డులపైనే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా ఈ కార్డుల సరఫరా, వీటిపై వివరాలను రాష్ట్రస్థాయిలో ఒకేచోట ముద్రించడం, పోస్టులో పంపడం వంటివన్నీ గుత్తేదారుకే అప్పగించనున్నారు.స్మార్ట్‌కార్డుల జారీకి సంబంధించి అతి త్వరలో టెండర్లను పిలిపించి గుత్తేదారును ఎంపిక చేయనున్నారు. గత 2024 అక్టోబర్ 1వ తేదీ నుంచి గత జనవరి నెలాఖరు వరకు దాదాపు మొత్తం 27 లక్షల కార్డులను జారీ చేయాలి. అంతేకాకుండా 2023వ సంవత్సరం ఆగస్టు నుంచి 2024 సెప్టెంబర్ వరకు స్మార్ట్ కార్డుల జారీని పూర్తిగా నిలిపేసిన నేపథ్యంలో దాదాపు 23 లక్షల కార్డులను ఇవ్వలేదు.గతంలో వాహనాల రిజిస్ట్రేషన్ చేసుకున్నవాళ్లు, డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందిన వారిలో ఎవరైనా సరే వారికి ఆర్‌సీ, డీఎల్ కావాలని దరఖాస్తును చేసుకుని ఫీజును చెల్లించినట్లయితే వారికి సైతం క్యూఆర్ కోడ్‌తో ఉన్నటువంటి స్మార్ట్‌కార్డులను రవాణాశాఖ జారీ చేయనుంది.

# నాంపల్లి ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్ని ప్రమాదం

**'ఫైల్స్‌లోని డేటా రికవరీ చేయడం కష్టం'**

**నాంపల్లి ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్ని ప్రమాదం**

**ఘటనలో దాదాపు 1,100 ఫైల్స్ దగ్ధం అయినట్లు గుర్తించిన ప్రత్యేక బృందం**

**ఫైల్స్‌లోని డేటా రికవరీ చేయడం కష్టమని తేల్చిన బృందం**





నాంపల్లి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో ఇటీవల జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ ఘటనలో మొత్తం 1,100 ఫైల్స్ దగ్ధం అయినట్లు నాగ్‌పూర్ నుంచి వచ్చిన స్పెషల్ టీం గుర్తించింది. ఈ దగ్ధమైన ఫైల్స్‌లోని డేటా రికవరీ కోసం ఆ బృందం ఎంతో తీవ్రంగా ప్రయత్నించింది. తాజాగా ఈ ఫైల్స్‌లోని డేటా రికవరీ చేయడం కష్టమని ప్రత్యేక బృందం తేల్చి చెప్పింది.ఈ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో వివిధ కేసుల దర్యాప్తులో ఎఫ్ఎస్ఎల్ కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులో వెంట్రుకలు, ఎలక్ట్రానిక్ డివైజ్‌ల విశ్లేషణ, రక్తం, వేలిముద్రలు, బుల్లెట్లు, లేదా డీఎన్ఏ నమూనాలు, ఆయుధాలు, డాక్యుమెంట్లు ఫోర్జరీ జరిగాయా లేదా ప్రతీది ఇతర అన్ని ఆధారాలను ల్యాబ్‌లోనే పరిశీలించి నివేదికలు సిద్ధం చేస్తారు. ఈ ఆధారాలు ఎన్నో కోర్టు తీర్పుల్లో కీలకంగా ఉంటాయి. కానీ ఈ ప్రమాద ప్రభావం వల్ల కేసుల దర్యాప్తుపై ఎంత వరకు పడనుందనేది ఆందోళనకరమైన విషయం.

# రూ. 49 లక్షలు స్వాహా
# చిలక్కి చెప్పినట్లు చెప్పినా వినలేదు!

**పోలీసుల మాట వినకుండా సైబరాసురుల ఉచ్చులో పడిన స్టీల్ ప్లాంట్ విశ్రాంత ఉద్యోగి**

**డిజిటల్ అరెస్టని భయపెట్టడంతో రూ.49 లక్షలు బదిలీ చేసిన విశ్రాంత ఉద్యోగి**



కళ్లముందు నిత్యం ఎన్నో మోసాలు, డిజిటల్ అరెస్టులు, వందల సంఖ్యలో సైబర్ నేరాల గురించిన వార్తలను ప్రతిరోజు చూస్తున్నాం. సైబర్ నేరస్థుల వలలో పడి కోట్లు పోగొట్టుకున్న అమాయకపు ప్రజలు ఎందరో ఉన్నారు. అప్రమత్తతపై ఎప్పటికప్పుడు అధికారులు హెచ్చరిస్తున్నా, సరే తగిన సూచనలను ఇస్తున్నా, అత్యాశతో బాధితులు ఈ నేర ఉచ్చులో పడుతున్నారు. ఇలాంటి ఘటనే విజయవాడలో చోటు చేసుకుంది. అసలు ఏం జరిగిందంటే?డిజిటల్ అరెస్టు అనే పదమే ఎక్కడా లేదు. ఆ పేరుతో వచ్చే కాల్స్‌కు స్పందించవద్దని పోలీసులు ఆ రిటైర్డ్ ఉద్యోగికి చిలక్కి చెప్పినట్లు చెప్పారు. రూ.72.50 లక్షలు బదిలీ చేసేందుకు బ్యాంకుకు వచ్చిన అతణ్ని వెనక్కి పంపించారు. ఎవరైనా ఇబ్బంది పెడితే తమను సంప్రదించాలని భరోసా ఇచ్చారు. 15 రోజుల్లో మళ్లీ సైబర్ నేరగాళ్ల నుంచి అతనికి ఫోన్ కాల్ వచ్చింది. దీంతో మోసగాళ్లకు రూ.49 లక్షలు బదిలీ చేశారు ఆ విశ్రాంత ఉద్యోగి.విజయవాడలో స్థిరపడిన స్టీల్ ప్లాంట్ విశ్రాంత ఉద్యోగికి గత నెలాఖరులో ఈడీ నుంచి ఫోన్ చేస్తున్నామంటూ ఓ కాల్ వచ్చింది. మీ పై కేసులు ఉన్నాయని బెదిరించారు. యూనిఫాంలో వీడియో కాల్ చేసిన వ్యక్తి రూ.72.50 లక్షలు ఇవ్వాలని, అలా చేస్తే మీ కేసు మాఫీ చేస్తానని అన్నాడు.దీంతో రిటైర్డ్ ఉద్యోగి విజయవాడ రామచంద్రనగర్‌లోని ఎస్‌బీఐ బ్రాంచికి వెళ్లారు. తన పేరిట ఉన్న రూ.78 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లను రద్దు చేసుకున్నారు. అందులో నుంచి రూ.72.50 లక్షలను మరో అకౌంట్‌కు బదిలీ చేయాలని కోరారు. అనుమానం వచ్చిన బ్యాంకు అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఖాతా నంబరు పరిశీలిస్తే అది కోల్‌కతాకు చెందినదని తేలింది.దీంతో పోలీసులు ఆ లావాదేవీ నిలివేశారు. డిజిటల్ అరెస్టు మోసాలపై అవగాహన కల్పించారు. తర్వాత మళ్లీ బ్యాంకుకు వచ్చిన విశ్రాంత ఉద్యోగి బెంగళూరుకు మారిపోతున్నాము అంటూ ఎఫ్‌డీ క్లోజ్ చేశారు. ఆ మొత్తాన్ని తన పొదుపు అకౌంట్‌లోకి బదిలీ చేయించుకున్నారు.అనంతరం ఇండియన్ బ్యాంకులో అకౌంట్ తెరిచారు. అక్కడి నుంచి మోసగాళ్ల ఖాతాకు రూ.49 లక్షలు బదిలీ చేశారు ఆ విశ్రాంత ఉద్యోగి. ఆ సమయంలో బ్యాంకు సిబ్బంది అతన్ని ప్రశ్నించారు. ఆయన తెలిసిన వ్యక్తికే పంపిస్తున్నామని చెప్పారు. తీరిగ్గా 4 రోజుల తర్వాత పోలీసులను ఆశ్రయించారు. తనకు మళ్లీ అదే ఫోన్ కాల్ వచ్చిందనీ, మోసగాళ్లు బెదిరించడంతో బదిలీ చేశానని ఆయన పోలీసులకు చెప్పారు. తాను పోగొట్టుకున్న సొమ్మును తిరిగి ఇప్పించాలని అర్థించారు.ఇదిలా ఉండగా మరోవైపు సైబర్ నేరాల పట్ల ఉన్న అవగాహనతో ఓ వృద్ధ జంట చాకచక్యంగా బయటపడ్డారు. పోలీసులు కల్పిస్తున్న అవగాహనతో సైబర్ నేరస్థులకు చెక్ పెట్టారు. కృష్ణా జిల్లా ఉయ్యూరులో సైబర్ నేరస్థుల నుంచి ఈ మధ్యకాలంలో రిటైర్డ్ అయిన వృద్ధులను లక్ష్యంగా చేసుకొని కోట్లు కొల్లగొడుతున్న డిజిటల్ అరెస్ట్ సైబర్ నేరం నుండి కృష్ణా జిల్లా ఉయ్యూరు టౌన్ పోలీసులు ఇద్దరు వృద్ధులను కాపాడారు.డిజిటల్ అరెస్ట్ అనే పదం కానీ పద్ధతి గాని ఎక్కడా లేదని ముంబై క్రైమ్ బ్రాంచ్, ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్, కస్టమ్స్, సీబీఐల నుండి మాట్లాడుతున్నాం మీ ఆధార్ కార్డు సిమ్ కార్డులు మనీ ల్యాండరింగ్‌లో ఇరుక్కున్నాయి లేదంటే డ్రగ్స్ రవాణాలో ఇన్వాల్వ్ అయ్యి ఉన్నాయి, అని ఎవరైనా బెదిరిస్తే వెంటనే స్థానిక పోలీస్ వారికి గాని, 1930 గాని రిపోర్ట్ చేయాలని ఈ సందర్భంగా కృష్ణాజిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలియజేశారు.

# 'ఏఐ'ని అదుపుచేసి ముందుకు వెళ్లాలి

**మానవ సంబంధాలు మంటగలిసిపోతాయేమో**

**వెంకయ్యనాయుడు ఆందోళన**

**విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉండకుండా ఏఐని కట్టడి చేయాలన్న మాజీ ఉప రాష్ట్రపతి**

**మన కట్టు, బొట్టుకు ప్రాధాన్యత ఇవ్వాలన్న వెంకయ్యనాయుడు**

**భారత్ విశ్వగురువు అయినా ఏ దేశం మీదా దండయాత్ర చేయలేదన్న వెంకయ్యనాయుడు**



కృత్రిమ మేధ(ఏఐ)ని అదుపుచేసి ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఏఐ వస్తే మానవ సంబంధాలు మంటగలిసిపోతాయేమోననే భయం తనకు ఉందని అన్నారు. విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉండకుండా ఏఐని కట్టడి చేయాల్సి ఉందని అన్నారు. విజయవాడలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన పూర్వ విద్యార్థుల సంఘం స్వర్ణోత్సవ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశాన్ని, మాతృభాషను, చదువుకున్న విద్యా సంస్థను, గురువులను మరిచిపోకూడదని అన్నారు. మన కట్టు, బొట్టుకు ప్రాధాన్యత ఇవ్వాలని, తెలుగు భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని అన్నారు. యువత పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. మన పూర్వీకులు మనకు అందించిన సంప్రదాయాలని భావితరాలకు అందించాలని వ్యాఖ్యానించారు.భారత్ విశ్వగురువు అయినప్పటికీ ఏ దేశం మీదా దండయాత్ర చేయలేదని గుర్తు చేశారు. భారత్ సత్తాను ప్రపంచ వేదికల మీద మన వారు చాటుతున్నారని ప్రశంసించారు. కులం కంటే గుణం మిన్న అనే విషయాన్ని అందరూ గుర్తించాలని అన్నారు. డిగ్రీల కంటే పరిజ్ఞానం ముఖ్యమని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాంకేతికతకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు.భవిష్యత్తులో చాలా రంగాల్లో ఉద్యోగాలు పోయే అవకాశం ఉందని, దీని గురించి మాట్లాడాల్సిన అవసరం ఉందని వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. రాజకీయాల్లో నాయకులు బూతులు విపరీతంగా మాట్లాడుతున్నారని, గత ఎన్నికల్లో బూతులు మాట్లాడిన వారు ఓడిపోయారని వెల్లడించారు. సమాజం కూడా అలాంటి వాళ్లను బహిష్కరించాలని హితవు పలికారు. రామాయణాన్ని అన్ని పాఠ్యపుస్తకాల్లో పొందుపరచాలని అన్నారు.తల్లిదండ్రులు, ఇంట్లోని పెద్దలు తమ పిల్లలకు ఎక్కువ సమయం కేటాయించాలని వెంకయ్యనాయుడు సూచించారు. విద్యార్థులు, యువత ప్రతి దానికి గూగుల్ మీద ఆధారపడుతున్నారని, కానీ వారు దీనిని పక్కన పెట్టి బుర్రకు పని చెప్పాలని సూచించారు.

## కలబందతో మెరిసే అందం మీ సొంతం ఎలా వాడాలంటే



అలోవెరాలో విటమిన్లు , ఫోలిక్ యాసిడ్, కోలిన్, %దీ1, దీ2, దీ3, దీ6, దీ%12 విటమిన్లు, కాల్షియం, మెగ్నీషియం, జింక్, క్రోమియం, సెలీనియం, సోడియం, ఐరన్, పొటాషియం వంటి దాదాపు 20 రకాల ఖనిజాలు ఉంటాయి. మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇది ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. అందుకే ఆయుర్వేదంలో కలబందకు ప్రత్యేక స్థానం ఉంది. ఎన్నో వ్యాధుల నివారణకు దీనిని ఔషధంగా వినియోగిస్తారు. కాబట్టి అలోవెరా జెల్ ప్రయోజనాలు, దానిని ఎలా ఉపయోగించాలో ఇక్కడ తెలుసుకుందాం..

**అలోవెరా జెల్‌ని ముఖానికి అప్లై చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు ఇవే..**

అలోవెరా జెల్ ముఖంపై ఫైన్ లైన్స్ సమస్య నుంచి బయటపడటానికి సులభమైన పరిష్కారం. దీన్ని చేతులు, ముఖానికి అప్లై చేయడం వల్ల చర్మంలో కొల్లాజెన్ స్థాయిలు పెరిగి చర్మం మెరుస్తుంది. దీన్ని రోజూ ముఖానికి రాసుకోవడం వల్ల చర్మం మృదువుగా, ఆరోగ్యంగా మారుతుంది.

**సూర్య కిరణాల నుంచి రక్షణ**

అలోవెరా శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది. అలోవెరా జెల్‌ను ముఖానికి అప్లై చేయడం వల్ల దద్దుర్లు, ముఖం వాపు నుండి ఉపశమనం పొందవచ్చు. దీన్ని ముఖానికి అప్లై చేయడం వల్ల సూర్యకిరణాలు చర్మంపై ప్రభావం చూపవు. బయట ఎక్కువ పని చేసే వారు ఇంటికి వచ్చిన తర్వాత అలోవెరా జెల్‌ని ముఖానికి రాసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

# గ్రీన్ టీతో మెదడు చురుకుదనం



గ్రీన్ టీ ఆరోగ్యకరం అనే విషయం మనందరికీ తెలిసిందే! అయితే గ్రీన్ టీలోని సహజసిద్ధ మూలకాలు అల్జీమర్స్ నుంచి మెదడుకు రక్షణ కల్పిస్తాయనే ఒక అధ్యయనం తాజాగా వెలుగులోకొచ్చింది.గ్రీన్ టీలోని నికోటినమైడ్, ఎపిగాలోక్టేకిన్ గాలేట్ అనే రెండు సహజసిద్ధ మూలకాలు మెదడులోని పాత కణాలు కొత్త వాటిలా చురుగ్గా పని చేసేందుకు దోహదపడతాయని క్యాలిఫోర్నియా విశ్వవిద్యాలయ పరిశోధకులు కనిపెట్టారు. ఈ రెండు మూలకాలు, నష్ట నివారణలో తోడ్పడే జిటిపి అనే కీలక శక్తి అణువులను పునరుద్ధరిస్తాయని వారు పేర్కొంటున్నారు. ఈ ప్రయోగాన్ని వయసు పైబడిన ఎలుకల మీద చేపట్టినప్పుడు, అల్జీమర్స్ వ్యాధితో ముడిపడి ఉన్న అమైలాయిడ్ బీటా అనే ప్రొటీన్ మోతాదు తగ్గడాన్ని పరిశోధకులు గుర్తించారు. సాధారణంగా మనుషులకు వయసు పైబడినప్పుడు, మెదడు కణాలు శక్తిని కోల్పోతూ ఉంటాయి. ఆ కణాలను గ్రీన్ టీలోని రెండు సహజసిద్ధ మూలకాలతో చికిత్స చేసినప్పుడు, కేవలం 24 గంటల్లోనే, శక్తిమోతాదులు పెరిగి, మెదడులో 'ఆటొఫజీ' ఊపందుకుంటోంది. ఈ చికిత్స ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను కూడా తగ్గిస్తుంది. గతంలో అల్జీమర్స్ పరిశోధనల్లో, మెదడు కణాలను ఆరోగ్యంగా ఉంచడంలో జిటిపి పాత్రకున్న ప్రాధాన్యాన్ని పరిశోధకులు పెద్దగా పట్టించుకోలేదు. తాజా అధ్యయనంలో వాటిని బలపరుచుకునే మార్గం తెలిసింది కాబట్టి గ్రీన్ టీతో మెదడు కణాలను ఆరోగ్యంగా ఉంచుకోవడం ద్వారా అల్జీమర్స్‌కు అడ్డుకట్ట వేయగలిగే మార్గం సుగమం అయింది.

# డ్రాగన్ ఫ్రూట్ ఉపయోగాలెన్నో



గులాబీ రంగులో ఆకర్షణీయంగా, చూడగానే తినేయాలనిపించేలా ఉంటుంది డ్రాగన్ ఫ్రూట్. ఈ పండులో అనేక పోషకాల ఉన్నాయని నిపుణులు అంటున్నారు. ఆ వివరాల గురించి తెలుసుకుందాం.డ్రాగన్ ఫ్రూట్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. దీని వలన జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. గ్యాస్, అసిడిటీ, కడుపుబ్బరం వంటివి తగ్గుతాయి.ఈ పండులో ఐరన్ కూడా ఎక్కువ మొత్తంలో ఉంటుంది. అది ఎర్రరక్తకణాల ఉత్పత్తిని పెంచి రక్తహీనతను దూరం చేస్తుంది.ఇందులోని విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది. అలాగే కొల్లాజన్ ఉత్పత్తిని పెంచి అందాన్ని కాపాడుతుంది.దీనిలోని మెగ్నీషియం, క్యాల్షియంలు ఎముకల దృఢత్వానికి దోహదం చేస్తాయి.డ్రాగన్ ఫ్రూట్‌లోని యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీరాడికల్స్‌తో పోరాడతాయి.ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి.ఫ్లేవనాయిడ్స్, ఫినోలిక్ యాసిడ్, ఆస్కార్బిక్ యాసిడ్‌లు రక్తంలో చక్కెరస్థాయులను నియంత్రించడంలో సహాయపడతాయి.

## గుండె జబ్బుల బారిన పడొద్దంటే
# మీ వంటలో ఈ మార్పు తప్పక చేయండి



ఈ మధ్య కాలంలో గుండె జబ్బుల మరణాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. వీటిలో చాలా మరణాలకు రక్తంలో కొవ్వు పేరుకుపోవడమే ప్రధాన కారణం అవుతోంది. మరి రక్తంలో కొవ్వు పేరుకోకూడదు అంటే మన ఆహారపు అలవాట్లలో చాలా మార్పులు చేసుకోవాలి. ముఖ్యంగా మనం వాడే వంట నూనె విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. మన ఆరోగ్యం కచ్చితంగా మనం ఇంట్లో ఏ వంట నూనె ఉపయోగిస్తున్నాం అనే దానిపై ఆధారపడి ఉంటుంది.అదేవిధంగా నూనె రకం ఏదైనా సరే దాన్ని ఎక్కువగా వినియోగించడం కూడా మన గుండె ఆరోగ్యానికి కీడు చేస్తుంది. నూనె ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల సిరల్లో చెడు కొలెస్ట్రాల్ పరిమాణం పెరుగుతుంది. దీనివల్ల ముందుగా అధిక రక్తపోటు వచ్చి ఆ తర్వాత గుండెపోటు, గుండె వైఫల్యం, కరోనరీ ఆర్టరీ డిసీజ్, ట్రిపుల్ వెస్సెల్ డిసీజ్లకు దారి తీస్తుంది. కాబట్టి మనం వంట నూనె రకంపైన మాత్రమేగాకుండా వంటల్లో వినియోగించే నూనె మోతాదు విషయంలో కూడా జాగ్రత్తగా ఉండాలి.రక్త నాళాల్లో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి కొన్ని మేలైన వంట నూనెలను మాత్రమే వినియోగించాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. నూనె విషయంలో వంటలో మార్పు చేయకపోతే అనారోగ్యాన్ని కొని తెచ్చుకున్నట్లే అవుతుందని హెచ్చరిస్తున్నారు. కొన్ని నూనెలు చెడు కొలెస్ట్రాల్‌కు చెక్ పెడతాయని, వాటిని తీసుకోవడంవల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచిస్తున్నారు. వేరుశెనగ నూనెతో కొలెస్ట్రాల్ పెరుగుతుందని అంటారు. కానీ ఇది అపోహ అని నిపుణులు అంటున్నారు.వేరుశనగ నూనెను ఉపయోగించడం ఆరోగ్యానికి మంచిది. వేరుశనగ నూనెలో విటమిన్ ఇ, ఫైటోస్టెరాల్ అధిక మొత్తంలో ఉంటాయి. అయితే అధిక రక్తపోటు, మధుమేహం లాంటి దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్నవాళ్లు నెలల తరబడి ఒకే నూనెను కాకుండా.. రెండు నెలలకు ఒకసారి నూనె రకాన్ని మారిస్తే బాగుంటుంది. అదేవిధంగా అవిసె గింజలలో ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి అవిసె నూనెను వంటల్లో వాడితే శరీరంలో కొలెస్ట్రాల్‌తోపాటు మంట తగ్గుతుంది. అయితే అవిసె నూనెను అధిక ఉష్ణోగ్రత వద్ద మరిగించినా, ఫ్రిజ్‌లో పెట్టి కూల్ చేసినా దాని సహజ లక్షణాన్ని కోల్పోతుంది. కాబట్టి అలాంటి పొరపాటు చేయకూడదు.ఆలివ్ నూనె కూడా ఆరోగ్యానికి చాలా మంచిది. అయితే మన దేశంలో ఆలివ్ నూనె ఉత్పత్తి తక్కువగా ఉంటుంది. దానిని మధ్యప్రాచ్యం, మధ్యధరా దేశాల నుండి దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. కాబట్టి భారత్‌లో ఆలివ్ నూనె ధర చాలా ఎక్కువగా ఉంటుంది. కానీ ఆర్థిక స్తోమతను బట్టి అరుదుగానైనా ఆలివ్ నూనెను వంటలో భాగం చేసుకోవడం ముఖ్యం. దీనిలో విటమిన్ ఎ, విటమిన్ డి, విటమిన్ ఇ, విటమిన్ కె ఉంటాయి. అంతేగాక ఇది యాంటీ ఇన్‌ఫ్లమేటరీ కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సాయపడుతుంది.

# మళ్లీ మళ్లీ పెరిగే దంతాలు



పాల దంతాలు ఊడిపోయి, వాటి స్థానంలో శాశ్వత దంతాలొస్తాయి. ఈ రెండో దంతాలు ఊడిపోతే కట్టుడు దంతాలు మినహా మరే మార్గమూ ఉండదు. కానీ తాజాగా జపాన్ శాస్త్రవేత్తలు మూడోసారి దంతాలు పెరిగే ఒక ఔషధాన్ని సృష్టించే ప్రయత్నంలో ఉన్నారు. ఆసక్తికరమైన ఈ అంశం గురించి తెలుసుకుందాం!రెండోసారి ఊడిపోయిన శాశ్వత దంతాల స్థానంలో, చిగుళ్ల నుంచి మూడో దంతాల సెట్ పెరగడం ఎలా ఉంటుందో ఒకసారి ఊహించండి. కిటానో ఆస్పత్రి మెడికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన డాక్టర్ కట్సు టకహాషి నాయకత్వంలోని పరిశోధకుల బృందం, దంతాల పెరుగుదలకు అవరోధంగా మారుతున్న యుఎసఎజి-1 అనే జన్యు ప్రొటీన్‌ను అడ్డుకునే ఔషధాన్ని అభివృద్ధి చేసింది. ఎలుకల మీద చేపట్టిన ప్రయోగాల్లో, ఈ ప్రొటీన్‌ను అణచివేయడం ద్వారా, కొత్త దంతాల పెరుగుదల విజయవంతంగా ఊపందుకోవడాన్ని పరిశోధకులు కనిపెట్టారు. 2013 నాటికి ఈ చికిత్సను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో, మనుషుల మీద కూడా ఈ ప్రయోగాలను చేపట్టడానికి పరిశోధకులు సిద్ధపడుతున్నారు. ఈ ప్రయోగం విజయవంతమైతే, ఎన్నో కోట్ల మందికి మూడవ దంతాల సెట్ ప్రయోజనం దక్కుతుంది. దశాబ్దాల పునరుత్పాదక పరిశోధన ఆధారంగా నిర్మితమైన సైన్స్... షార్కులు, ఏనుగుల మాదిరిగానే మనుషులు కూడా సహజసిద్ధంగా పెరిగే బహుళ దంతాల సెట్‌ను కలిగి ఉంటారని పరిశోధకులు నమ్ముతున్నారు. డెంటల్ పల్ప్, ఎముకల పునరుత్పాదకతలో కొనసాగుతున్న అభివృద్ధి ఆధారంగా... జన్యుపరమైన కారణాల రీత్యా, ప్రమాదాల్లో, లేదా వార్ధక్యంతో కోల్పోయిన దంతాలను తిరిగి మొలిపించుకునే వీలు కలుగుతుందని పరిశోధకులు అంటున్నారు.

# ఫ్యాటీ లివర్ సమస్యకు అద్భుతమైన ఛూమంత్రం
# ఈ మూలికలు తీసుకుంటే ప్రమాదకర వ్యాధి సైతం పరార్




శరీరంలో అదనపు కేలరీలు చేరడం వల్ల, కాలేయంలో కొవ్వు పేరుకుపోవడం ప్రారంభమవుతుంది.. వైద్య భాషలో దీనిని హెపాటిక్ స్టీటోసిస్ అంటే ఫ్యాటీ లివర్ డిసీజ్ అంటారు. నేటి కాలంలో చెడు జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా ఈ వ్యాధి చాలా సాధారణమైనదిగా మారుతోంది. మధుమేహం, స్థూలకాయంతో బాధపడేవారికి ఈ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఫ్యాటీ లివర్ చికిత్స వ్యాధి దశపై ఆధారపడి ఉంటుంది.ఫ్యాటీ లివర్.. మూడు దశలను కలిగి ఉంటుంది %-% గ్రేడ్ 1- హెపాటిక్ స్టీటోసిస్, గ్రేడ్ 2- నాన్-ఆల్కహాలిక్ స్టీటోహెపటైటిస్, గ్రేడ్ 3- సిర్రోసిస్%శా% గ్రేడ్ 1 అనేది కాలేయంలో కొవ్వు చేరడం ప్రారంభ దశ. ఇందులో 5-33 శాతం కొవ్వు కాలేయంలో పేరుకుపోతుంది. ఇందులో ఎలాంటి ప్రత్యేక లక్షణాలు కనిపించవు. ఈ దశ చాలా తీవ్రమైనది కానప్పటికీ, మీరు కాలేయంపై శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉన్న సంకేతం. ఇంటి నివారణల ద్వారా కూడా దీనిని పూర్తిగా తిప్పికొట్టవచ్చు.అయితే.. ఫ్యాటీ లివర్ సమస్యకు కొన్ని ఆయుర్వేద చిట్కాలతో చెక్ పెట్టవచ్చు.. ముఖ్యంగా జీవనశైలిలో మార్పులతోపాటు.. కొన్ని ఇంటి నివారణ చిట్కాలను పాటిస్తే.. కొవ్వు కాలేయ వ్యాధిని నివారించవచ్చు.. ఆయుర్వేదం ప్రకారం.. మీకు గ్రేడ్ 1 ఫ్యాటీ లివర్ ఉంటే, ఈ మూలికలు దాని పెరుగుదలను ఆపడంలో, పూర్తిగా నయం చేయడంలో చాలా ప్రయోజనకరంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.

**వీటితో ఫ్యాటీలివర్ కు చెక్ పెట్టండి..**

**తిప్పతీగ:** తిప్పతీగలో యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి.. వీటి కారణంగా, ఇది కాలేయానికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. కాలేయ పనితీరును ప్రభావితం చేసే వ్యాధులకు తిప్పతీగ ఆకులు ఇమ్యునోమోడ్యులేటర్‌గా పనిచేస్తాయి.. రోజూ అర టీస్పూన్ తిప్పతీగ పౌడర్‌ని గోరువెచ్చని నీటితో కలిపి తాగడం వల్ల ప్రయోజనకరంగా ఉంటుంది.

**వెల్లుల్లి:** భారతీయ వంటగదిలో ఉపయోగించే ఈ మసాలా నిజానికి ఆయుర్వేదంలో ఉపయోగించే మూలిక. ఇందులో అల్లిసిన్, సెలీనియం ఉన్నాయి. ఇవి కాలేయాన్ని శుభ్రపరచడానికి ఎంజైమ్‌లను సక్రియం చేయడంలో సహాయపడతాయి. అటువంటి పరిస్థితిలో, ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఒకటి లేదా రెండు వెల్లుల్లి రెబ్బలు తినడం వల్ల కొవ్వు కాలేయంలో సహాయకరంగా ఉంటుంది.

**త్రిఫల:** కొవ్వు కాలేయ వ్యాధిలో త్రిఫల వినియోగం చాలా ప్రభావవంతంగా పరిగణించబడుతుంది. అధిక యాంటీఆక్సిడెంట్ కంటెంట్.. కాలేయాన్ని శుభ్రపరిచే.. నిర్విషీకరణ చేసే సామర్థ్యం ఉసిరి, కరక్కాయ, తానికాయల మిశ్రమానికి ఉంది.. అటువంటి పరిస్థితిలో కొవ్వు కాలేయాన్ని నివారించేందుకు మీరు రోజూ అర టీస్పూన్ త్రిఫల పొడిని గోరువెచ్చని నీటితో తీసుకోవచ్చు..

**పసుపు:** పసుపును క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కాలేయం నుండి కొవ్వును తగ్గించడంలో చాలా సహాయపడుతుంది. ఇది శోథ నిరోధక, యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంది. ఇది వ్యాధుల నుంచి కాలేయాన్ని రక్షిస్తుంది. మీరు గోరువెచ్చని నీటితో ఖాళీ కడుపుతో త్రాగవచ్చు.

**(నోట్:** ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణుల సలహాలు, సూచనల మేరకు అందించడం జరిగింది. ఏవైనా సందేహాలు ఉంటే నిపుణులను సంప్రదించాలని సూచిస్తున్నాము.)

# గాంధీజీ ఆరోగ్యం వెనుక సీక్రెట్ ఇదే ఈ డైట్ ప్లాన్ మీరు ట్రై చేస్తారా


మహాత్మా గాంధీని ఆదర్శంగా తీసుకునేవారు ప్రపంచవ్యాప్తంగా ఉన్నారు. ఆయన అడుగుజాడల్లో నడిచేవారు మనదేశంలో అడుగడుగునా కనిపిస్తారు. అయితే, గాంధీజీ పాటించిన ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, అనుసరించిన జీవనశైలిని అతి తక్కువమంది మాత్రమే ఫాలో అవుతుంటారు. అనారోగ్యకరమైన ఆహారం, అపసవ్య జీవనశైలితో.. నేటితరం నడి వయసులోనే వార్ధక్యాన్ని సమీపిస్తున్నది. అలాంటివాళ్లంతా.. ఏడుపదుల వయసులోనూ చలాకీగా కనిపించిన గాంధీజీ నుంచి ఎంతో నేర్చుకోవాలి. 'ఆరోగ్యమే మహాభాగ్యం' అని నమ్మే మహాత్ముడి సిద్ధాంతాలను ఒంట బట్టించుకోవాలి.మహాత్మాగాంధీ పూర్తి శాకాహారి. మితాహారి కూడా! ఆహారం విషయంలో ఆయన కచ్చితంగా ఉండేవారు. తన రోజూవారీ ఆహారంలో అన్ని రకాల పోషకాలు ఉండేలా చూసుకొనేవారు. దంపుడు బియ్యంతో చేసిన అన్నం మాత్రమే తీసుకొనేవారు. వీటిలో అధికంగా ప్రొటీన్లు, విటమిన్లు ఉంటాయి. శరీరానికి ఎంతో ఉపయోగపడతాయి. పచ్చి కూరగాయలను తినడానికి ఇష్టపడే వారు. అవికూడా సేంద్రియ పద్ధతుల్లో పండించినవే! వండటం వల్ల కూరగాయల్లోని పోషకాలు పోతాయనీ, పచ్చిగా తింటేనే వాటిలోని ప్రొటీన్లు, విటమిన్లు పూర్తిస్థాయిలో మన శరీరానికి అందుతాయని చెప్పేవారాయన. తృణధాన్యాలతో చేసిన రొట్టెలను రోజూ తప్పకుండా తినేవారు. ముఖ్యంగా సాయంత్రాల్లో కూరగాయల సలాడ్ తీసుకొనేవారు. హెర్బల్ టీ తయారీలో బెల్లం మాత్రమే వాడేవారు. చక్కెరను పక్కన పెట్టేవారు. ఆయన శాకాహారి కాబట్టి, శరీరానికి కావాల్సిన మాంసకృత్తులను పొందడానికి డ్రైఫ్రూట్స్‌ను ఆశ్రయించేవారు.

**సవ్యమైన జీవనశైలితోనే..**

గాంధీజీ ప్రతిరోజు సుమారుగా 15 కిలోమీటర్లకు పైగా నడిచేవారు. నడకను మించిన వ్యాయామం లేదనేవారు. ఇక ప్రాణాయామం.. ఆయన దినచర్యలో భాగం. సాయంత్రం వేళల్లోనూ తక్కువస్థాయి వ్యాయామాలు చేసేవారు. ధూమపానం, మద్యపానంలాంటి అనారోగ్యకరమైన అలవాట్లకు ఆయన పూర్తి వ్యతిరేకం. ఈ రెండిటినీ నిర్మూలించడానికి ఎంతో కృషి చేశారు. శారీరక, మానసిక ఆరోగ్యంపై ఇవి అధిక చెడు ప్రభావాన్ని చూపుతాయని ఎప్పుడూ చెబుతుండేవారు. పర్యావరణ పరిశుభ్రతకూ ఎంతో ప్రాధాన్యం ఇచ్చేవారు గాంధీజీ. పర్యావరణం బాగుంటేనే మనిషి ఆరోగ్యం బాగుంటుందని నమ్మేవారు. వ్యక్తిగత శుభ్రతనూ కచ్చితంగా పాటించేవారు.

**రోజువారీ జీవితం..**

గాంధీజీ తన దినచర్యను గోరువెచ్చని నీటితోనే ప్రారంభించేవారు. ఇలా చేయడం వల్ల రక్త నాళాలు ఉత్తేజితం అవుతాయి. కండరాలు, అవయవాలకు రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి.అల్లం టీ లేదా హెర్బల్ టీ తాగేవారు.సీజనల్ పండ్లను ఎక్కువగా తీసుకునేవారు.భోజనానికి 20 నిమిషాల ముందు



కూరగాయలు,పండ్లతో చేసిన సలాడ్ తీసుకొనేవారు.మధ్యాహ్న భోజనంలో పప్పుతోపాటు తృణధాన్యాలతో చేసిన రొట్టెలను తీసుకొనేవారు. దంపుడు బియ్యంతో చేసిన అన్నం తినేవారు. అలాగే ఆయన భోజనంలో పెరుగు ఉండేలా చూసుకొనేవారు.సాయంత్రం పూట గ్రీన్ టీ లేదా అల్లం టీని తాగేవారు. డ్రై ఫ్రూట్స్‌ను స్నాక్స్‌గా తీసుకొనేవారు.గాంధీజీ రాత్రి భోజనం చాలా తక్కువగా ఉండేది. రాగి జావ, జొన్న అంబలి లాంటివి తాగేవారు.ఇక పడుకోడానికి 30 నిమిషాల ముందు ఆయుర్వేద మూలికలు కలిపిన కప్పు గోరువెచ్చని పాలను తీసుకునేవారు

# అమ్మల కోసమూ అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎలా పనిచేస్తుందంటే



అన్నిటా మిన్నగా వినిపిస్తున్న ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఇప్పుడు.. కాబోయే అమ్మలు, పుట్టబోయే బిడ్డల కోసం పనిచేయనున్నది. ఐటీలో అగ్రగామి, సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన బెంగళూరు నగరం ఇందుకు వేదిక అవుతున్నది. మాతాశిశు ఆరోగ్యాన్ని మెరుగుపరిచే దిశగా బెంగళూరు మహా నగర పాలక సంస్థ ఆరోగ్య విభాగం 'ఏఐ' సాయం తీసుకుంటున్నది.'సేవ్‌మామ్' పేరుతో ఏఐ ఆధారిత పైలట్ ప్రాజెక్టు ఇటీవలే ప్రారంభమైంది. దీని ద్వారా నగరంలోని గర్భిణులు, నవజాత శిశువులు, పాలిచ్చే తల్లుల ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తున్నది. సురక్షితమైన ప్రసవాలు జరిగేలా చూసుకోవడానికి ఈ ప్రాజెక్టులో ఇప్పటికే 300 మంది గర్భిణులు పేర్లను నమోదు చేసుకోగా.. వీరిలో 15 మంది హైరిస్క్ ప్రెగ్నెన్సీ ఉన్నవారిని గుర్తించారు.వీరికి పూసల దండలను పోలిన ఏఐ ఆధారిత స్మార్ట్ గ్యాడ్జెట్లను అందించనున్నారు. ఈ స్మార్ట్ గ్యాడ్జెట్లు స్థానిక ఆశా కార్యకర్తలు మొదలుకొని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రైవేట్ క్లినిక్‌లతో అనుసంధానమై ఉంటాయి. ఇవి ప్రసవం అయ్యేవరకూ గర్భిణుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తాయి. వారు ఎప్పుడు డాక్టర్ దగ్గరికి వెళ్లాలో, ఎలాంటి పరీక్షలు చేయించుకోవాలో చెబుతాయి.పరీక్షల ఫలితాలను కూడా ట్రాక్ చేస్తాయి. ఏదైనా ఇబ్బంది తలెత్తినప్పుడు స్థానిక ఆశా కార్యకర్తలు, వైద్యాధికారులకు సందేశాలు పంపుతాయి. ఇలా.. గర్భిణులతోపాటు వారికి పుట్టిన శిశువుల సంరక్షణ కోసం వెయ్యి రోజులపాటు ఫాలోఅప్ సేవలు అందిస్తాయి. డెలివరీ తర్వాత కూడా.. శిశువులను మానిటర్ చేస్తూ, ఎప్పుడెప్పుడు టీకాలు వేయించాలో కూడా చెబుతాయి. ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టుగా మొదలైన ఈ కార్యక్రమం సత్ఫలితాలను అందిస్తే.. మరింత విస్తృతంగా ఉపయోగించే యోచనలో ఉన్నారు అధికారులు.

# చమురు వ్యూహం మార్చిన భారత్

**వెనెజువెలా నుంచి ముడిచమురు కొనుగోలు ప్రారంభం**

**చెరో 1 మిలియన్ బ్యారెళ్ల చమురు కొన్న బీపీసీఎల్, హెచ్ఎంఈఎల్**

**కొచ్చి, బీనా, బటిండా రిఫైనరీలకు చేరనున్న చమురు**

**చమురు దిగుమతికి అమెరికా నుంచి లైసెన్స్ పొందిన రిలయన్స్**




దేశీయ ఇంధన అవసరాలను తీర్చుకోవడంలో భారత్ సరికొత్త వ్యూహంతో ముందుకు సాగుతోంది. అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు, అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందాల నేపథ్యంలో.. రష్యా నుంచి దిగుమతులు తగ్గించి, వెనెజువెలా వైపు మొగ్గు చూపుతోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ రంగ సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) తొలిసారిగా వెనెజువెలా నుంచి ముడిచమురు కొనుగోలు చేయగా, ప్రైవేటు సంస్థ హెచ్‌పీసీఎల్ మిట్టల్ ఎనర్జీ లిమిటెడ్ (హెచ్ఎంఈఎల్) రెండేళ్ల విరామం తర్వాత మళ్లీ అక్కడి నుంచి దిగుమతులు చేపట్టింది.

**కొనుగోలు వివరాలు..**

అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ఈ రెండు రిఫైనరీలు చెరో 1 మిలియన్ బ్యారెళ్ల చమురును కొనుగోలు చేశాయి. ప్రముఖ గ్లోబల్ ట్రేడర్ 'విటోల్' ద్వారా ఈ ఒప్పందం కుదిరినట్లు తెలుస్తోంది. అయితే, ఈ వ్యవహారంపై రెండు సంస్థల నుంచి స్పందన రావాల్సిఉంది. షిప్పింగ్ ఖర్చులను తగ్గించుకోవడానికి ఈ రెండు ఆర్డర్లను ఒకే భారీ నౌక (వీఎల్ సీసీ) ద్వారా భారత్‌కు తరలించనున్నారు. బీపీసీఎల్ ఈ చమురును కేరళలోని కొచ్చి మరియు గుజరాత్‌లోని బీనా రిఫైనరీలకు తరలించనుంది. హెచ్ఎంఈఎల్ దీనిని గుజరాత్‌లోని ముంద్రా పోర్ట్ ద్వారా పంజాబ్‌లోని బటిండా రిఫైనరీకి పంపనుంది.

**అమెరికాతో వాణిజ్య ఒప్పందం..**

ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై అదనపు సుంకాలను రద్దు చేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా రష్యా చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేస్తుందని, దానికి బదులుగా అమెరికా మరియు వెనెజువెలా నుంచి చమురు దిగుమతులు పెంచుతుందని ట్రంప్ ప్రకటించారు. తాజా కొనుగోళు ఈ ఒప్పందంలో భాగంగానే జరుగుతున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

**ప్రయోజనాలు ఇవే..**

వెనెజువెలా నుంచి లభించే 'మెరీ' గ్రేడ్ ముడిచమురుపై భారీగా డిస్కౌంట్లు లభించే అవకాశం ఉంది. రష్యాపై ఆధారపడటం తగ్గించి, చమురు వనరులను వైవిధ్యం చేసుకోవడం వల్ల దేశ ఇంధన భద్రత మరింత బలపడుతుంది. అమెరికా నేరుగా వెనెజువెలా చమురు విక్రయాలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, భారతీయ రిఫైనరీలకు ఎటువంటి చట్టపరమైన ఇబ్బందులు లేకుండా తక్కువ ధరకు చమురు లభిస్తోంది.

**గతంలో వెనెజువెలా నుంచి కొనుగోలు..**

గతంలో 2019 వరకు వెనెజువెలా నుంచి భారత్ పెద్ద మొత్తంలో చమురు కొనుగోలు చేసేది. అయితే అమెరికా ఆంక్షల వల్ల అది నిలిచిపోయింది. మళ్లీ ఇప్పుడు మారుతున్న రాజకీయ సమీకరణాల వల్ల ఈ వాణిజ్యం పుంజుకుంటోంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ కూడా ఇప్పటికే వెనెజువెలా నుంచి నేరుగా చమురు దిగుమతి చేసుకునేందుకు అమెరికా నుంచి లైసెన్స్ పొందినట్లు సమాచారం.

# ప్రపంచంలో మరే దేశానికీ సాధ్యం కాని పని భారత్ చేసి చూపించింది: మాక్రాన్

**యూపీఐ వ్యవస్థపై ఫ్రాన్స్ అధ్యక్షుడి ప్రశంసల జల్లు**

**140 కోట్ల మంది పౌరులకు డిజిటల్ గుర్తింపు కల్పించిందని వ్యాఖ్య**

**జైపూర్ లో ప్రధాని మోదీతో యూపీఐ అనుభవాన్ని ప్రస్తావించిన మాక్రాన్**



భారతదేశానికి చెందిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ ఫేస్ (యూపీఐ) వ్యవస్థను ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ కొనియాడారు. 140 కోట్ల మంది పౌరులకు డిజిటల్ గుర్తింపును కల్పిస్తూ భారత్ నిర్మించిన ఈ వ్యవస్థను ప్రపంచంలో మరే దేశమూ సాధించలేకపోయిందని ఆయన ప్రశంసించారు. 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026'లో బుధవారం మాక్రాన్ మాట్లాడుతూ, సాంకేతికత సామాన్యుల జీవితాలను ఎలా మార్చివేసిందో వివరించారు.

**ముంబై వీధి వ్యాపారి ఉదాహరణతో..**

మాక్రాన్ తన ప్రసంగంలో ముంబై వీధి వ్యాపారితో తన వ్యక్తిగత అనుభవాన్ని ప్రస్తావించారు. "పదేళ్ల క్రితం ముంబైలోని ఒక వీధి వ్యాపారికి బ్యాంక్ ఖాతా తెరవడానికి చిరునామా లేదు, సరైన పత్రాలు లేవు. కానీ ఈ రోజు, అదే వ్యాపారి తన ఫోన్ ద్వారా దేశంలో ఎవరి నుంచైనా తక్షణమే, ఉచితంగా నగదును స్వీకరించగలుగుతున్నారు" అని మాక్రాన్ పేర్కొన్నారు. 140 కోట్ల మందికి డిజిటల్ గుర్తింపును అందించడం ద్వారా భారత్ అద్భుతం సృష్టించిందని ఆయన కొనియాడారు.

**జైపూర్‌లో యూపీఐ అనుభవం..**

2024లో మాక్రాన్ భారత్ లో పర్యటించినప్పుడు ప్రధాని మోదీతో కలిసి జైపూర్‌లోని హవా మహల్ సమీపంలో కుల్హాద్ టీ తాగారు. అప్పుడు ప్రధాని మోదీ తన మొబైల్ ఫోన్ ద్వారా బిల్లు చెల్లించడం చూసి మాక్రాన్ ఆశ్చర్యపోయారు. యూపీఐ వ్యవస్థ పనితీరు గురించి మోదీ ఆయనకు వివరించారు.

**ఫ్రాన్స్‌లో యూపీఐ సేవలు..**

ఫ్రాన్స్‌లో యూపీఐ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని ప్రధాని మోదీ 2023 జూలైలో ప్రకటించారు. 2024 ఫిబ్రవరిలో భారత్ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను స్వీకరించిన తొలి యూరోపియన్ దేశంగా ఫ్రాన్స్ నిలిచింది. ఎన్ పీసీఐ ఇంటర్నేషనల్ మరియు ఫ్రాన్స్‌కు చెందిన 'లైరా' సంస్థల మధ్య కుదిరిన ఒప్పందంతో ఫ్రాన్స్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో యూపీఐ చెల్లింపులు ప్రారంభమయ్యాయి. దీనివల్ల ఫ్రాన్స్‌కు వెళ్లే భారతీయ పర్యాటకులు, విద్యార్థులు తమ వద్ద ఉన్న యూపీఐ యాప్స్ ద్వారా సులభంగా చెల్లింపులు చేయగలుగుతున్నారు. భారతదేశం నిర్మించిన ఈ డిజిటల్ మౌలిక సదుపాయాలు ఇప్పుడు ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని మాక్రాన్ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

# ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి... అయినప్పటికీ లాభాల్లో ముగిసిన మార్కెట్లు

**బ్యాంకింగ్, మెటల్, ఎఫ్ఎంసీజీ రంగాల షేర్ల అండతో లాభాలతో ముగిసిన సూచీలు**

**283 పాయింట్ల లాభంతో 83,734 వద్ద ముగిసిన సెన్సెక్స్**

**వరుసగా మూడో సెషన్‌లో లాభాలను నమోదు చేసిన నిఫ్టీ**

**డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలహీనపడిన రూపాయి**




ఐటీ రంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగినప్పటికీ, దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాలతో ముగిశాయి. బ్యాంకింగ్, మెటల్, ఎఫ్ఎంసీజీ స్టాక్స్‌లో వెల్లువెత్తిన కొనుగోళ్లు మార్కెట్లకు అండగా నిలిచాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 283 పాయింట్లు పెరిగి 83,734 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 93 పాయింట్లు లాభపడి 25,819 వద్ద నిలిచింది. నిఫ్టీ లాభాల్లో ముగియడం ఇది వరుసగా మూడో సెషన్ కావడం గమనార్హం. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ సూచీ 1.23 శాతం నష్టపోగా, మిగిలిన అన్ని సూచీలు గ్రీన్ మార్క్‌లో ముగిశాయి. నిఫ్టీ ఎఫ్ఎంసీజీ, మెటల్, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు వరుసగా 1.21 శాతం, 1.33 శాతం, 1.31 శాతం చొప్పున లాభపడ్డాయి. బ్రాడర్ మార్కెట్లు కూడా సూచీలకు అనుగుణంగానే రాణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.50 శాతం, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.54 శాతం లాభపడ్డాయి. ఉదయం సెషన్‌లో నష్టాల్లోకి జారుకున్న మార్కెట్లు, మధ్యాహ్నం తర్వాత బలమైన రికవరీ కనబరిచాయి. సెన్సెక్స్ తన కనిష్ట స్థాయి అయిన 83,206 నుంచి 585 పాయింట్లకు పైగా పుంజుకుంది. దేశీయ సంస్థాగత మదుపరుల (డీఐఐ) నుంచి పెట్టుబడులు నిలకడగా కొనసాగడం మార్కెట్లకు బలమైన మద్దతు ఇస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు. దేశీయ వృద్ధి అవకాశాలపై ఉన్న సానుకూల దృక్పథంతో సెంటిమెంట్ బలంగానే ఉందని వారు తెలిపారు. మరోవైపు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 2 పైసలు స్వల్పంగా బలహీనపడి 90.66 వద్ద ట్రేడ్ అయింది. బీఎస్ఈలో 2,110 షేర్లు లాభపడగా, 1,916 షేర్లు నష్టపోయాయి.

# నిస్సాన్ 'గ్రావిటే'.. రూ.5.65 లక్షలకే 7 సీటర్ ఫ్యామిలీ కారు!

**భారత మార్కెట్లోకి నిస్సాన్ గ్రావిటే ఎంపీవీ విడుదల**

**దేశంలోనే అత్యంత చవకైన 7-సీటర్ కారుగా గుర్తింపు**

**పరిచయ ఆఫర్‌గా ప్రారంభ ధర రూ.5.65 లక్షలు**

**అన్ని వేరియంట్లలోనూ 6 ఎయిర్‌బ్యాగ్‌లు స్టాండర్డ్**

**1.0 లీటర్ పెట్రోల్ ఇంజిన్‌తో 19.6 కి.మీ మైలేజ్**




ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ నిస్సాన్ ఇండియా, భారత మార్కెట్లో సంచలనం సృష్టిస్తూ తన సరికొత్త కాంపాక్ట్ ఎంపీవీ 'గ్రావిటే'ను విడుదల చేసింది. 7-సీటర్ సెగ్మెంట్‌లో దేశంలోనే అత్యంత సరసమైన కారుగా ఇది నిలవనుంది. దీని ప్రారంభ ధరను రూ.5.65 లక్షలుగా (ఎక్స్-షోరూమ్) కంపెనీ ప్రకటించింది. అయితే, ఈ ప్రత్యేక ధర మొదటి 5,000 బుకింగ్‌లకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేసింది. గ్రావిటే 1.0 లీటర్, త్రీ-సిలిండర్ పెట్రోల్ ఇంజిన్‌తో వస్తుంది. ఇది 72 ఎహ్‌ప్రజూ పవర్, 96 చీఎ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 5-స్పీడ్ మాన్యువల్ లేదా 5-స్పీడ్ ఏఎంటీ గేర్‌బాక్స్ ఆప్షన్లతో ఇది అందుబాటులో ఉంది. ఏఎంటీ వేరియంట్ 19.6 నెఎజూశ్రీ, మాన్యువల్ వేరియంట్ 19.3 మైలేజీని ఇస్తాయని కంపెనీ పేర్కొంది. దీంతోపాటు డీలర్ వద్ద సీఎన్‌జీ కిట్‌ను అమర్చుకునే సౌకర్యం కూడా ఉంది. డిజైన్ పరంగా గ్రావిటే ఆకట్టుకుంటోంది. నిస్సాన్ సిగ్నేచర్ డిజైన్‌తో పాటు పియానో-బ్లాక్ హెక్సాగన్ గ్రిల్, మస్క్యులర్ సైడ్ ప్రొఫైల్, 15-అంగుళాల స్టీల్ వీల్స్ ఉన్నాయి. ఇంటీరియర్‌లో ఫ్లెక్సిబుల్ 7-సీటర్ (5+2) లేఅవుట్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. భద్రత విషయంలో నిస్సాన్ ఏమాత్రం రాజీ పడలేదు. అన్ని వేరియంట్లలోనూ స్టాండర్డ్‌గా 6 ఎయిర్‌బ్యాగ్‌లు, టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, హిల్-స్టార్ట్ అసిస్ట్ వంటి కీలక ఫీచర్లను అందిస్తోంది. భారత మార్కెట్లో తమ ఉనికిని బలోపేతం చేసుకునే వ్యూహంలో భాగంగా ఈ కొత్త మోడల్‌ను తీసుకొచ్చినట్లు నిస్సాన్ మోటార్ ఇండియా అధ్యక్షుడు తీరి సబ్బాగ్ తెలిపారు. బడ్జెట్ ధరలో విశాలమైన ఫ్యామిలీ కారు కోరుకునే వారికి గ్రావిటే మంచి ఎంపిక కానుంది.

# మళ్లీ పెరుగుతున్న బంగారం ధరలు!

**దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో స్వల్ప పెరుగుదల**

**హైదరాబాద్‌లో రూ.1.57 లక్షలు దాటిన 10 గ్రాముల పసిడి**

**అంతర్జాతీయ పరిణామాలే ధరల పెరుగుదలకు కారణం**

**22 క్యారెట్ల బంగారం ధర రూ.1.44 లక్షల పైకి**



దేశంలో బంగారం ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. ఈ వారం మధ్యలో కాస్త తగ్గుముఖం పట్టిన పసిడి, శనివారం ఉదయం మరోసారి పెరిగింది. దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరల్లో స్వల్ప పెరుగుదల నమోదైంది. తెలుగు రాష్ట్రాల్లోని ముఖ్య నగరాలైన హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం (10 గ్రాములు) ధర రూ.1,57,380 వద్ద స్థిరపడింది. ఇక ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.1,44,260గా ఉంది. గుడ్‌రిటర్న్స్ వెబ్‌సైట్ కథనం ప్రకారం, శుక్రవారంతో పోలిస్తే 24 క్యారెట్ల బంగారంపై రూ.880, 22 క్యారెట్లపై రూ.800 మేర పెరిగింది. దేశంలోని ఇతర నగరాల్లోనూ ఇదే ధోరణి కనిపించింది. ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,57,520 ఉండగా, ముంబైలో రూ.1,57,370, చెన్నైలో రూ.1,57,300గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకుంటున్న పరిణామాలే బంగారం ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ నిర్ణయాలు, డాలర్ విలువలో మార్పులు, ప్రపంచంలోని కొన్ని ప్రాంతాల్లో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా పెట్టుబడిదారులు బంగారాన్ని సురక్షితమైన పెట్టుబడిగా భావిస్తున్నారు. ఈ కారణంగానే పసిడికి డిమాండ్ పెరిగి ధరలు పెరుగుతున్నాయని మార్కెట్ వర్గాలు వివరిస్తున్నాయి. ఈ ధరల పెరుగుదల సాధారణ వినియోగదారులపై, ముఖ్యంగా పెళ్లిళ్ల సీజన్‌లో బంగారం కొనుగోలు చేసే వారిపై ప్రభావం చూపనుంది.

# ట్రంప్ 'టారిఫ్' ట్విస్ట్: భారత్‌పై పన్ను 18 శాతం నుంచి 10 శాతానికి తగ్గింపు

**తాత్కాలికమేనన్న వైట్ హౌస్!**

**అమెరికా సుప్రీంకోర్టు తీర్పుతో తగ్గిన భారం , తాత్కాలికంగా 10 శాతం పన్ను విధింపు**

**కొత్త చట్టాల వేటలో ట్రంప్ సర్కారు , భారత్‌తో వాణిజ్యంపై పట్టుదల**




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన కొత్త గ్లోబల్ టారిఫ్ విధానంపై వైట్ హౌస్ కీలక వివరణ ఇచ్చింది. ఈ నేపథ్యంలో భారత వస్తువులపై ప్రస్తుతం ఉన్న 18 శాతం సుంకాన్ని తాత్కాలికంగా 10 శాతానికి తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఇటీవల అమెరికా సుప్రీంకోర్టు ట్రంప్ విధించిన ఏకపక్ష సుంకాలను కొట్టివేయడంతో, పాత పద్ధతిలో పన్నులు వసూలు చేసే అవకాశం లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. అయితే, ఇది భారత్‌కు లభించిన శాశ్వత ఊరట కాదని, త్వరలోనే మరిన్ని కఠిన చట్టాలను ప్రయోగించి ఈ సుంకాలను పెంచే అవకాశం ఉందని శ్వేతసౌధం స్పష్టం చేసింది. అసలు విషయం ఏమిటంటే, గతంలో భారత్‌తో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం పన్నును 25 నుంచి 18 శాతానికి తగ్గించారు. కానీ, ఆ పన్ను విధింపుకు వాడిన చట్టం చెల్లదని కోర్టు తీర్పునివ్వడంతో, ట్రంప్ సర్కారు ఇప్పుడు సెక్షన్ 122 కింద కొత్తగా 10 శాతం పన్నును అమలు చేస్తోంది. దీనిపై ట్రంప్ స్పందిస్తూ.. "భారత్‌తో కుదిరిన వాణిజ్య ఒప్పందంలో ఎలాంటి మార్పు లేదు. వారు పన్నులు చెల్లించాల్సిందే, మేము మాత్రం చెల్లించం. ఇది ఇప్పుడు న్యాయమైన ఒప్పందంగా మారింది" అని వ్యాఖ్యానించారు. అయితే, ఈ 10 శాతం పన్ను కేవలం ఒక ఆరంభం మాత్రమేనని ట్రంప్ సంకేతాలు ఇచ్చారు. భవిష్యత్తులో సెక్షన్ 232 లేదా 301 వంటి మరింత శక్తిమంతమైన చట్టాలను ఉపయోగించి, ఈ పన్నులను భారీగా పెంచే ఆలోచనలో ఉన్నట్లు ఆయన తెలిపారు. "మేము అనుకుంటే పన్నులు ఇంకా పెరగవచ్చు. మా వద్ద పాత చట్టాల కంటే శక్తిమంతమైన ప్రత్యామ్నాయాలు ఉన్నాయి" అని ట్రంప్ విలేకరులతో అన్నారు. దీనివల్ల భారతీయ ఎగుమతిదారులకు ప్రస్తుతానికి పన్ను భారం తగ్గినా, రాబోయే రోజుల్లో అనిశ్చితి కొనసాగే అవకాశం ఉంది.

# భారత్‌తో గూగుల్ భవిష్యత్ భాగస్వామ్యం గురించి స్పష్టమైన సంకేతాలు ఇచ్చిన సుందర్ పిచాయ్

**భారత్ లో జరుగుతున్న ఏఐ సమ్మిట్ కోసం విచ్చేసిన గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్**

**అంతకు ముందు జాతీయ మీడియాతో కాలిఫోర్నియా నుంచి వర్చువల్ గా మాట్లాడిన సుందర్**

**భారత్ ఏఐ ప్రయాణంలో గూగుల్ భాగస్వామి కావాలనుకుంటోందని స్పష్టీకరణ**



గూగుల్, ఆల్ఫాబెట్ సీఈఓ సుందర్ పిచాయ్ భారత్ లో జరుగుతున్న అంతర్జాతీయ ఏఐ సదస్సు సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఏఐ సమ్మిట్ సందర్భంగా మన జాతీయ మీడియాతో ఆయన కాలిఫోర్నియా నుంచి వర్చువల్ గా మాట్లాడుతూ భారత్ తో గూగుల్ భవిష్యత్ భాగస్వామ్యం గురించి స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు.

**పిచాయ్ వ్యాఖ్యల్లో కీలక అంశాలు:**

భారత ఏఐ ప్రయాణంలో గూగుల్ భాగస్వామి కావాలనుకుంటోంది. ఏఐ వినియోగంతో మరికొన్నేళ్లలో భారత్ మరింత ముందుకు వెళ్తుందని నేను నమ్ముతున్నాను. అందుకే ఇండియాతో భాగస్వామిగా ఉండాలనే స్పష్టమైన ఆశయంతో ఉన్నాం. భారత్ లో మౌలిక సదుపాయాలు, స్థిరమైన పెట్టుబడులు, డేటా సెంటర్ల ఏర్పాటు, స్థానిక భాగస్వాములతో పరిశోధనలు, యువతకు ఉపాధి అవకాశాలు సృష్టించడంపై గూగుల్ దృష్టి సారిస్తోంది. భారత్ లో క్లౌడ్ రీజియన్ స్థాపన కోసం రిలయన్స్ జియోతో కలిసి పనిచేస్తున్నాం. రాజస్థాన్ లో 150 మెగావాట్ల పునరుత్పాదక ఎనర్జీ ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తున్నాం. అదానీ, క్లీన్‌మాక్స్ వంటి సంస్థల భాగస్వామ్యంతో డేటా సెంటర్ల విస్తరణ జరుగుతోంది. భారత వినియోగదారుల కోసం ఏఐ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధిపై దృష్టి పెడుతున్నాం. భారత మీడియాతో ఈ మేరకు అమెరికా నుంచి వర్చువల్ గా మాట్లాడిన పిచాయ్... నేడు భారత్ కు చేరుకున్నారు. ఏఐ సదస్సు కోసం భారత్ కు రావడం తనకు చాలా సంతోషంగా ఉందని ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. శుక్రవారం ఏఐ సమ్మిట్ లో ఆయన ప్రసంగించనున్నారు.

# ఆ ఒక్క పని చేసుంటే సినిమా సూపర్ హిట్ అయ్యేది



టాలీవుడ్ ఇండస్ట్రీలో దర్శకుడిగా మంచి గుర్తింపును సంపాదించుకున్న వారిలో జయంత్ సి. పరాన్జీ ఒకరు. ఈయన తన కెరీర్లో ఎన్నో రీమేక్ మరియు కొత్త కథలతో రూపొందిన సినిమాలకు దర్శకత్వం వహించి విజయాలను సొంతం చేసుకున్నాడు.ఒకానొక సమయంలో ఈయన రీమేక్ సినిమాలకు దర్శకత్వం వహించనని కూడా చెప్పాడు. కానీ ఆ తర్వాత ఓ రీమేక్ సినిమాకు దర్శకత్వం వహించి చేదు అనుభవాన్ని మిగిల్చుకున్నాడు.పవన్ కళ్యాణ్ హీరోగా త్రిష, కృతి కర్బంద హీరోయిన్లుగా రూపొందిన తీన్‌మార్ మూవీని హిందీ ఫిలిం అయిన లవ్ ఆజ్ కల్ చిత్రానికి రీమేక్గా రూపొందించాడు. ఈ సినిమా బాక్స్ ఆఫీస్ దగ్గర ఫ్లాప్ను సొంతం చేసుకుంది. తాజాగా ఈ దర్శకుడు ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. అందులో భాగంగా తీన్‌మార్ సినిమా లవ్ ఆజ్ కల్ అనే హిందీ సినిమాకు రీమేక్గా రూపొందించాం. అలా రెడీ అయిన తర్వాత దానిని తెలుగు నేటివిటీకి తగ్గట్లు అనేక మార్పులు, చేర్పులు చేయాల్సింది, కానీ అలా మేమేమీ చేయకుండా రూపొందించాం. ఆ సినిమా ప్రేక్షకులకు పెద్దగా నచ్చలేదు. అదే నేను లవ్ ఆజ్ కల్ సినిమాను పవన్ కళ్యాణ్ తో చేయాలనుకున్న తర్వాత అందుకు తగినట్లు మార్పులు, చేర్పులు చేసుకున్నట్లయితే ప్రేక్షకులను బాగా ఆకట్టుకునేదేమో అని చెప్పుకొచ్చాడు. ఈ సినిమాలో పవన్ రెండు పాత్రల్లో నటించాడు. బండ్ల గణేష్ నిర్మించిన ఈ సినిమాకు మణిశర్మ సంగీతం అందించాడు.

## ఆ మూమెంట్ కోసం నేను ఎదురుచూస్తున్నాను



టాలీవుడ్ రెబల్ స్టార్ ప్రభాస్ పెళ్లి గురించి గత కొంత కాలంగా ఎన్నో వార్తలు వస్తూనే ఉన్నాయి. అనుష్క నుండి కృతి సనన్ వరకు ఎంతో మంది హీరోయిన్ల పేర్లు వినిపించినా.. ప్రభాస్ మాత్రం ఎప్పుడూ తన నవ్వు తోనే సమాధానం దాటవేస్తూ వచ్చారు. కానీ తొలిసారిగా ఆయన తన మనసులోని అసలు కోరికను బయటపెట్టి ఫ్యాన్స్‌కు పెద్ద సర్ప్రైజ్ ఇచ్చారు. రీసెంట్‌గా విడుదలైన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా మంచి విజయాన్ని అందుకోవడంతో, ఆ మూవీ టీమ్‌తో ప్రభాస్ ప్రత్యేకంగా ముచ్చటించారు. ఇంటర్వ్యూలో హీరోయిన్ మానస వారణాసి చమత్కారంగా 'ప్రేమపై మీ అభిప్రాయం ఏంటి డార్లింగ్?' అని అడిగేసరికి ప్రభాస్ కాసేపు సిగ్గుపడ్డారు. 'ఇది నీ పర్సనల్ క్వశ్చన్ కదా' అంటూనే, ఎవరూ ఊహించని సమాధానం ఇచ్చారు. "నిజం చెప్పాలంటే నాకు కూడా ప్రేమలో పడాలని ఉంది. ఆ అద్భుతమైన ఫీలింగ్‌ను అనుభవించాలని ఉంది. ఆ మూమెంట్ కోసం నేను కూడా ఆతృతగా ఎదురుచూస్తున్నాను " అని ప్రభాస్ చెప్పారు. ఈ మాట వినగానే అటు ఇంటర్వ్యూ చేస్తున్న టీమ్, ఇటు సోషల్ మీడియాలో నెటిజన్లు ఒక్కసారిగా షాక్ అయ్యారు. ఇప్పటి వరకు పెళ్లి అంటే తప్పించుకునే ప్రభాస్, ఇప్పుడు ప్రేమించాలని ఉంది అని చెప్పడం వెనుక ఏదైనా బలమైన సంకేతం ఉందా అని చర్చలు మొదలయ్యాయి. ప్రస్తుతం ప్రభాస్ వయస్సు 46 ఏళ్లు. ఆయన వయసు హీరోలంతా పెళ్లిళ్లు చేసుకుని సెటిల్ అయిపోయినా, ప్రభాస్ మాత్రం బాక్సాఫీస్ రికార్డులను వేటాడటంలోనే బిజీగా ఉన్నారు. అయితే తాజా కామెంట్స్ చూస్తుంటే, డార్లింగ్ త్వరలోనే తన జీవితంలోకి ఒక కొత్త వ్యక్తిని ఆహ్వానించడానికి సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తోంది.

# ఇండస్ట్రీకి రాకముందు స్రవంతి..



ప్రస్తుతం తెలుగులో యాంకర్ గా మంచి గుర్తింపును సంపాదించుకున్న వారిలో స్రవంతి చొక్కారపు ఒకరు. ఈమె కొంతకాలం క్రితం తెలుగు బిగ్ బాస్ షోలోకి ఎంట్రీ ఇచ్చి మంచి గుర్తింపును సంపాదించుకుంది.ఆ తర్వాత స్రవంతికి వరుస పెట్టి టీవీ షోలకు, సినిమా ఈవెంట్లకు యాంకరింగ్ చేసే అవకాశం దక్కింది. దానితో ఈమెకు ఒక్కసారిగా క్రేజ్ వచ్చింది. తాజాగా ఈ బ్యూటీ సుహాస్, శివానీ నాగారం జంటగా రూపొందిన హే బల్‌వంత్ అనే చిత్రంలో ఓ కీలకమైన పాత్రలో నటించింది. ఈ సినిమాను ఈరోజు అనగా ఫిబ్రవరి 20వ తేదీన విడుదల చేయనున్నారు. ఈ సినిమా కోసం ఈ నటి పెద్ద ఎత్తున ప్రచారాలను నిర్వహిస్తూ వచ్చింది. ఆ ప్రచారాలలో ఈమె తనకు చాలా సంవత్సరాల క్రితమే హీరోయిన్గా అవకాశం వచ్చిందని, అంతా ఓకే అయ్యిందని, చెన్నైలో అడ్వాన్స్ కూడా ఇస్తానన్నారని, కానీ అదే సమయంలో తనకు పెళ్లయిందని చెప్పడంతో వారు ఆ తర్వాత తనను సంప్రదించలేదని తెలిపింది. ఇన్నాళ్లకు తనకు హే బల్‌వంత్ మూవీలో అవకాశం వచ్చిందని, దీనితో తనను తాను ప్రూవ్ చేసుకుంటానని చెప్పింది. ఇక తాజాగా ఈమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కొన్ని విషయాలను తెలియజేసింది. తాజాగా స్రవంతి మాట్లాడుతూ... తాను ఇండస్ట్రీలోకి రాకముందు ఒక డైమండ్ స్టోర్లో పనిచేసేదాన్నని, అది చాలా కష్టంగా ఉండేదని, షాప్ లో ఉన్నంతసేపు నిల్చొనే ఉండాలని, అది ఎంతో బాధను కలిగించేదని, కానీ జీవితంలో ఎదగడం కోసం ఎన్నో కష్టాలను అనుభవించానని, ఇక ఆ సమయంలో జీతం తక్కువగానే వచ్చిన ఇన్సెంటివ్స్ మాత్రం బాగా వచ్చేవి, దానితో తన జీవితం గడిచిందని స్రవంతి చెప్పుకొచ్చింది.



# అదెలా సాధ్యం...

సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్లుగా కొనసాగాలంటే ఫిట్నెస్ అనేది చాలా ముఖ్యమైనది. అద్భుతమైన నటన ఉన్నా కూడా సరైన ఫిట్నెస్ లేనట్లయితే వారికి అవకాశాలు తగ్గే ఛాన్స్ ఉంటుంది.దానితో హీరోయిన్లు తమ బరువును కంట్రోల్లో ఉంచుకోవడం కోసం, ఫిట్ గా ఉండడం కోసం అనేక కసరత్తులు చేస్తారు, అలాగే ఫుడ్ తినే విషయంలో కూడా ఎన్నో నియమ నిబంధనలను పాటిస్తూ ఉంటారు. ఎక్కువ శాతం హీరోయిన్లు ఫ్యాట్ ఫుడ్ కు చాలా దూరంగా ఉంటారు.మరి ముఖ్యంగా కార్బోహైడ్రేట్స్ ఉన్న వంటకాలను దూరం పెడతారు. కానీ ఓ ముద్దుగుమ్మ మాత్రం కార్బోహైడ్రేట్స్ ఉన్న ఫుడ్ ను ఇష్టంగా తింటుందట, కానీ ఆమె ఇప్పటికీ ఎంతో ఫిట్ గా ఉంటూ స్టార్ హీరోయిన్లకు పోటీ ఇస్తుంది. ఆ నటి ఎవరు అనుకుంటున్నారా..? ఆమె మరెవరో కాదు.. రెజీనా కాసాండ్రా. శివ మనసులో శృతి సినిమాతో వెండితెరకు పరిచయం అయిన ఈ చిన్నది చాలా తక్కువ కాలంలోనే మంచి గుర్తింపును దక్కించుకుంది. ప్రస్తుతం కూడా ఈమె మంచి దశలోనే కెరీర్ను ముందుకు సాగిస్తుంది. తాజాగా ఈమె తన ఫుడ్ డైట్ గురించి క్లియర్గా తెలియజేసింది. తనకు సౌత్ వంటకాలు అంటే చాలా ఇష్టం అని, అందులో ముఖ్యంగా రైస్ లేకుంటే భోజనం సంతృప్తి కాదు అని తెలియజేసింది. నేను పక్కా రైస్ లవర్ ని, రోజులో కనీసం కొద్దిపాటి అన్నం అయినా తినాల్సిందే. పప్పు అన్నం, రసం అన్నం, ఇలా ఏదో ఒక రకంగా రోజు నేను తీసుకునే ఆహారంలో రైస్ కచ్చితంగా ఉంటుంది. అది లేకపోతే నా భోజనం అసంతృప్తిగా అనిపిస్తుంది అని చెప్పింది. రైస్ ఎక్కువగా తీసుకున్నప్పటికీ అందుకు తగిన వ్యాయామాలు చేసి మళ్లీ ఫిట్గా ఉంటాను అని రెజీనా చెప్పుకొచ్చింది.



# ధనుష్‌తో అలా చేయాలని కోరికగా ఉంది

టాలీవుడ్ సెన్సేషన్ మృణాల్ ఠాకూర్, కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ గత కొంతకాలంగా ప్రేమలో ఉన్నారంటూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతోంది.వీరిద్దరూ త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతున్నారనే వార్తలు వైరల్ అవ్వడంతో అభిమానుల్లో రకరకాల అనుమానాలు మొదలయ్యాయి. అయితే, ఈ వార్తలపై మృణాల్ ఇప్పటికే స్పందించి క్లారిటీ ఇచ్చినప్పటికీ పుకార్లకు చెక్ పడటం లేదు. వీరిద్దరికి సంబంధించిన ఏదో ఒక వార్త నెట్టింట వైరల్ అవుతూనే ఉంది. అంతేకాకుండా.. వారు పలు ఈవెంట్లలో సన్నిహితంగా కనిపించడంపై మళ్ళీ చర్చలు మొదలయ్యాయి. అసలు కలిసి ఒక్క సినిమా కూడా చేయని వీరిద్దరి మధ్య ఇంతటి స్నేహం ఎలా కుదిరిందనే ప్రశ్నలు నెటిజన్ల నుంచి వెల్లువెత్తుతున్నాయి. ?దొక పెద్ద మిస్టరీగా మారింది. ఈక్రమంలో.. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాల్, ధనుష్‌తో తనకున్న అనుబంధంపై ఆసక్తికర విషయాలను పంచుకుంది."ధనుష్ సార్ తన సినిమా 'తేరే ఇష్క్ మే' షూటింగ్‌లో బిజీగా ఉన్నప్పుడు, నేను ఆయనను 'సన్ ఆఫ్ సర్దార్-2' స్పెషల్ స్క్రీనింగ్ కోసం ఆహ్వానించాను. ఆయన వస్తారని నేను అస్సలు అనుకోలేదు, కానీ ఆయన రావడం నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది" అని మృణాల్ పేర్కొంది. ధనుష్ వంటి పెద్ద స్టార్ తన ఆహ్వానాన్ని మన్నించి రావడం పట్ల ఆమె తన కృతజ్ఞతను చాటుకుంది. ధనుష్‌పై తనకున్న అభిమానాన్ని మృణాల్ ఎంతో గొప్పగా వివరించింది. "ధనుష్ సార్ ఒక నటుడు మాత్రమే కాదు, ఆయన ఒక అద్భుతమైన సంస్థ . ఆయన గొప్ప గాయకుడు, డ్యాన్సర్, గీత రచయిత, దర్శకుడు కూడా. ఆయనలోని బహుముఖ ప్రజ్ఞను చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుంది. ధనుష్ సర్‌తో కలిసి పనిచేయాలని నాకు కోరికగా ఉంది" అని చెప్పింది.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.in epaper.vaarthasandhya.in. Cell : 73961 22101 , 99517 51662.